# ॐ వేదాంతభేరి ॐ

సంస్థాపకులు : శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

సంపుటము: 51 నవంబర్ 2018 సంచిక: 11

సంపాదకులు

**శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు**

**సంపాదక మండలి**

**శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు**

**శ్రీవిజయానంద బ్రహ్మచారి**

**కె.ఈశ్వర్**

**డాక్టర్ సముద్రాల లక్ష్మణయ్య,శిరోమణి, ఎం.ఎ.,**

**డాక్టర్ కె.సర్వోత్తమరావు,ఎం.ఎ., పి.హెచ్.డి.,**

శాశ్వత పోషక చందా రూ. 1500/- అంతకుమించి

**సంవత్సర చందా రూ. 100/-లు, విడి సంచిక రూ. 10/-లు**

**విదేశాలకు సంవత్సర చందా (ఎయిర్ మెయిలు) 20 డాలర్లు**

**చందా పంపవలసిన అడ్రసు :** శ్రీ శుకబ్రహ్మాశ్రమము,
స్వామి విద్యాప్రకాశానంద నగర్,
శ్రీ శుకబ్రహ్మాశ్రమము (పోస్టు)
శ్రీకాళహస్తి, పిన్ - 517640
ఫోన్ : 08578- 222239

**చందాదారులు ఉత్తర ప్రత్యుత్తరాలలో తమ చందా నెంబరు తప్పక వ్రాయవలెను.**

Printed & Published by Sri Vidyaswarupanandagiri swami on behalf of Sri Sukabrahma Ashramam and Printed by B.Viswanadham at C.N. Printer, TIRUPATI, Andhra Pradesh; Published at Sri Sukabramhasramam, Swami Vidyaprakashananda Nagar, Sri Sukabramhasramam Post, Srikalahasti-517 640, Chittoor Dist., Andhra Pradesh.
Editor : SRI VIDYASWARUPANANDA GIRI SWAMI






## విషయ సూచిక


01. ప్రార్థన - 05
02. విదేశవస్తు బహిష్కరణ-శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారు- 06
03. నిజానిజములను తెలుసుకొనుటలో గల ప్రయాస
- శ్రీ సద్గురు మలయాళస్వాములవారు - 11
04. శ్రీరామకృష్ణ కథామృతం - శ్రీ రామకృష్ణ పరమహంస -16
05. రాజయోగం - ఆరు పాఠాలు-5 - శ్రీ స్వామి వివేకానంద - 18
06. ప్రియవచనమ్ -శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు - 21
07. గ్రంథ ప్రచురణలు - డా॥ సముద్రాల లక్ష్మణయ్య - 26
08. స్మరణే తరణోపాయం - భగవాన్ సత్యసాయిబాబా - 28
09. శ్రీ మదాంధ్ర మహాభాగవతం-ఆచార్య జక్కంపూడి మునిరత్నం - 35
11. రామ జోగి మందు కొనరే - డా॥ ఆచార్య కె.సర్వోత్తమరావు - 39
12. మనస్సును టీ.వీ.ని బాగుచేసుకుందాం - కె. ఈశ్వర్ - 41
13. వార్తలు - 42


## ముఖచిత్రం -
## శ్రీ సత్యసాయిబాబా

7-11-2018 దీపావళి.
11-11-.18 నాగులచవితి,14-11-18 బాలల దినోత్సవం
22-11-18 కార్తీక పూర్ణిమ / కార్తీక దీపోత్సవము
23-11-18 సత్యసాయిబాబా జయన్తి.

ఇందులోని వ్యాసముల భావములకు వ్యాస రచయితలే బాధ్యులు

# ప్రార్థన

**01.** ఓం ప్రాతః స్మరామి హృది సంస్ఫురదాత్మతత్త్వం
సచ్చిత్సుఖం పరమహంసగతిం తురీయమ్ ।
యత్స్వప్న జాగరసుషుప్తిమవైతి నిత్యం
తద్బ్రహ్మ నిష్కళమహం న చ భూతసంఘః ॥

**02.** ఓం ప్రాతర్భజామి మనసోవచసాం అగమ్యం
వాచో విభాన్తి నిఖిలా యదనుగ్రహేణ ।
యం నేతి నేతి వచనై ర్నిగమా అవోచుః
తం దేవదేవ మజమచ్యుతమాహు రగ్ర్యాః ॥

**03.** ఓం ప్రాతర్నమామి తమసః పరమర్కవర్ణం
పూర్ణం సనాతనపదం పురుషోత్తమాఖ్యమ్ ।
యస్మిన్నిదం జగదశేషం అఖండమూర్తౌ
రజ్జ్వాం భుజంగ ఇవ ప్రతిభాసితం వై ॥

**తా ॥** సచ్చిదానంద రూపమై, పరమహంసలచే పొందబడునదై, తురీయమై, జాగ్రత్స్వప్నసుషుప్తులకు అతీతమై, నిత్యమై హృదయమున స్ఫురించునట్టి ఆత్మతత్త్వమును ప్రాతః కాలంలో స్మరించుచున్నాను.

ఏది మనోవాక్కులకు అగమ్యమైనదో, దేనియనుగ్రహంతో వాక్కులన్నియు ప్రకాశిస్తున్నాయో, దేనిని వేదాలు. 'ఇది కాదు, ఇది కాదు' అను నిషేధ వాక్యముల ద్వారా వర్ణించాయో, దేనిని దేవదేవుడని, అజుండని, అచ్యుతుడని ఋషులు చెప్పారో అట్టి ఆత్మతత్త్వాన్ని ప్రాతః కాలంలో భజిస్తున్నాను.

ఏది తమస్సుకు పరమో, సూర్యుని వంటి తేజో రూపమై వుందో, పరిపూర్ణం, సనాతన పదం పురుషోత్తముడని చెప్పబడెనో, దేనియందు త్రాడులో సర్పంవలె ఈ జగమంతా ప్రతిభాసించుచున్నదో అట్టి అఖండరూపమైన ఆత్మతత్త్వాన్ని ప్రాతఃకాలంలో నమస్కరిస్తున్నాను.





# విదేశ వస్తు బహిష్కరణ

– శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

స్వదేశ వస్తువు ఆత్మ ఒక్కటియే. దృశ్యపదార్థములన్నియు నామరూపములన్నియు విదేశ వస్తువులు. మహాత్ములు నశ్వరములుగ నామరూపములనుండి తమ దృష్టిని మరలించి, వాటిపై మమత్వమును విడనాడి శాశ్వతమగు ఆత్మయందే, స్వదేశ వస్తువునందే మనసును లగ్నపఱచుచుందురు. బహిర్ముఖత్వము వదలి అంతర్ముఖులై ఆత్మారాములై పఱగుదురు. అంతస్సుఖులై, అంతరారాములై యుందురు. 'న తేషు రమతే బుధః ' (తెలివిగలవాడు దృశ్యవిలాసములందు, విషయభోగములందు రమింపకయే యుండును ) – అని గీతాచార్యుని వాక్యము.

పూర్వము స్వరాజ్య సంపాదనకై జరిగిన ఆందోళనయందు స్వదేశ వస్తువులనే వాడవలసినదనియు, విదేశ వస్తువులను బహిష్కరించవలసినదనియు నాయకులుద్బోధించిరి. స్వరాజ్య సాధనకై అట్టి విధానమును ప్రజలవలంబించి లక్ష్యమును బడసి కృతకృత్యులైరి. అట్లే స్వారాజ్య (మోక్ష) సాధన మందు ముముక్షువులగువారు విదేశ వస్తువులగు ప్రాపంచిక విషయ విలాసములందు దృష్టినుంచక, స్వదేశ వస్తువగు ఆత్మయందే దృష్టిని కేంద్రీకరించవలయును. క్షేత్రమునుండి మనస్సును తప్పించి క్షేత్రజ్ఞునియందు ప్రవేశపెట్టవలెను. ఈ సత్యమునే భగవానుడు – 'ఆత్మసంస్థం మనః కృత్వాన కించిదపి చింతయేత్' అను గీతావాక్యము ద్వారా వెల్లడి చేసెను. అనగా మనస్సును బహిర్ముఖ వస్తువులనుండి ఆత్మయందు స్థాపించి అన్యమేమియు చింతింపరాదు – అని అర్థము. ఈ ప్రకారముగ ధ్యానమును శీలించినచో మనుజుడు అక్షయసుఖమును బడయగలడనియు గీతాచార్యుడు వక్కాణించెను. అయితే ఆనందకరములైన ఈ విషయజాలములను, ఈ భోగ విలాసములను

ఏల పరిత్యజించవలెనని జనులు ప్రశ్నించవచ్చును. ఆ ఆనందము పరిపూర్ణానందము కాదు. చంచలమగు రాజసిక సుఖము, దుఃఖమిశ్రితమైన సుఖము. "దుఃఖయోనయ ఏవ తే" ప్రాపంచిక భోగములు పైకి సుఖముగా కానిపించి లోన దుఃఖము కలవేయగును. జాలరివాడు గాలము చివరగల ఇనుప సూదికి మాంసపు ముక్కను తగిలించి నీటిలో వదలును. అమాయకమగు చేప పైన కనిపించు మాంసమునే చూచి "ఆహా! ఈ రోజు ఎటువంటి చక్కటి భోజ్యవస్తువు లభించినది!" అని తలంచి దానిని తినుటకు ఉవ్విళ్ళూరును. కాని వాస్తవముగ దాని లోపలనున్నది ప్రాణాంతకమగు ఇనుప సూది. అది కంఠమునకు గ్రుచ్చుకొనగా చేప మరణించుచున్నది. అట్లే జీవుడును అజ్ఞానవశమున తాను అనుభవించబోవు ప్రాపంచిక భోగము పరమానందకరమగు విషయమని తలంచును. కాని అనుభవించిన వెంటనే దుఃఖము వెన్నంటుచున్నది. కనుకనే తరించ కుతూహలము గలిగిన మహనీయులు వాటి జోలికి పోరు. వాటియెడల విరక్తిగలవారై, అంతర్ముఖులై శాశ్వత పరమాత్మను ధ్యానించుచుందురు.

భగవదనుభూతికి ఇట్టి వైరాగ్యము ప్రధాన హేతువు. అది లేనిదే సాధకుడు అధ్యాత్మ క్షేత్రమున ఒక్క అంగుళమైనను ముందుకు పోజాలడు. దీపము వెలుగుటకు ప్రమిద ఎటువంటిదో జ్ఞానజ్యోతి వెలుగుటకు విషయవిరక్తి అటువంటిది. అది లేనిచో జ్ఞానము కలుగదు. కలిగినను నిలవదు.

కాబట్టి ఈ సంసార బాధల నుండి తప్పించుకొని బయటపడదలంచు ప్రతి జీవియు తన హృదయాంతరాళమున వెలుగుచుండు పరంజ్యోతియగు పరమాత్మ యందు – స్వదేశ వస్తువు నందు మనస్సును నెలకొల్పి, దుఃఖ ప్రదములగు నశ్వర విషయభోగములందు, ప్రాపంచిక విషయవిలాసములందు దృశ్యజాలమను విదేశవస్తు సముదాయమందు మనస్సును పరుగిడనీయక బహుజాగరూకుడై యుండవలెను. తనది కాని వస్తువగు దృశ్యమందు అభిరుచి యేల?

తనది కాని వస్తువును తనదని భావించి, దానిని స్వాధీనపఱచుకొని



అనుభవించువాడు లోకములో దొంగ అని చెప్పబడును. దొంగతనమును శాస్త్రము నిషేధించినది. ప్రభుత్వమున్ను నిషేధించినది. ఈ ప్రకారముగ నిషేధింపబడిన ఆ 'దొంగతనము' అను దానిని ఎవడాచరించునో అతడు ప్రభుత్వ విశ్వప్రభుత్వ శాసనముల ననుసరించి శిక్షార్హుడగును. మఱియు ఆయా ప్రభుత్వములవారిచే విధింపబడు శిక్షను అతడు అనుభవించవలసి వచ్చును.

ఈ శరీరముగాని, ఇంద్రియములుగాని, మనస్సుగాని, బుద్ధిగాని తనవి కావు. తాను నిత్య శుద్ధ బుద్ధ ముక్త సచ్చిదానందాత్మ స్వరూపుడు. తాను చైతన్యమే కాని జడము కాదు. దేహేంద్రియాదులన్నియు జడములు. కాలగర్భమందు నశించిపోవునవి. తాను నశించు వస్తువు కాదు. దేశకాల క్రియలకు తాను అతీతుడు. తాను సర్వసాక్షియగు దృక్ స్వరూపుడే కాని దృశ్యము కాదు క్షేత్రజ్ఞుడే కాని క్షేత్రము కాదు. తాను కాని వస్తువులన్నిటిని ఒకచోట పేర్కొని వానికి క్షేత్రము అను పేరు పెట్టెను శ్రీకృష్ణ పరమాత్మ గీతలో. అవి యేవనగా –

**మహాభూతాన్యహంకారో బుద్ధిరవ్యక్తమేవచ**

**ఇన్ద్రియాణి దశైకంచ పంచచేన్ద్రియ గోచరాః**

**ఇచ్ఛాద్వేషస్సుఖం దుఃఖం సంఘాతశ్చేనాధృతిః**

**ఏతత్క్షేత్రం సమాసేన సవికారముదాహృతమ్.**

పృథివ్యాది పంచమహాభూతములు, అహంకారము, బుద్ధి, మూలప్రకృతి, పదునొకండు ఇంద్రియములు ( 5 కర్మేంద్రియములు + 5 జ్ఞానేంద్రియములు + మనస్సు ), 5 ఇంద్రియ విషయములు (శబ్దస్పర్శాదులు) కోరిక, ద్వేషము, సుఖము, దుఃఖము, దేహేంద్రియాదుల సముదాయము, వృత్తిజ్ఞానము, ధైర్యము – ఇవన్నియు క్షేత్రమనబడును. అవి వికారవంతములు. ఇవి తాను కాదు. వీని యన్నిటికిని సాక్షియైన ఆత్మయే తాను.

పరమార్థసత్యము ఈ విధముగ నుండగ అజ్ఞానియగు జీవుడు ఆ దేహాదులే తానని తలంచి వానిపై అభిమానమును పెంచుకొనుచున్నాడు. అనగా శ్రుతిస్మృతులచే సత్యము కాదని నిషేధింపబడిన వానియందు మమత్వము, అభిమానము కలిగియుండుచున్నాడు. తనది కాని వస్తువును తనదని తలంచు దొంగయొక్క ప్రవృత్తిని బోలిన ప్రవృత్తి కలిగియుండు చున్నాడు. తత్ఫలితముగ దొంగ శిక్ష అనుభవించునట్లు – విశ్వప్రభుత్వముచే శిక్షితుడై జన్మజరా మరణాదులను, నరకాదులను అనుభవించవలసి వచ్చినది. ఈ భావమునే శ్రీ శంకరాచార్యుల వారు ఈ క్రింది శ్లోకముల ద్వారా చక్కగ నిరూపించి యున్నారు.

**శ్రుతిస్మృతిన్యాయ శతైర్నిషిద్ధే**

**దృశ్యే ఽ త్ర యః స్వాత్మమతిం కరోతి**

**ఉపైతి దుఃఖోపరి దుఃఖజాతం**

**నిషిద్ధకర్తా సమలిమ్లుచో యథా.**

'శ్రుతులచేతను, స్మృతులచేతను, పెక్కు న్యాయశాస్త్రముల చేతను నిషేధింపబడిన (అసత్యమని త్రోసివేయబడిన) ఈ దేహాది దృశ్య ప్రపంచమునందు తాను, తనది అను బుద్ధిగలిగి యుండువాడు, నిషిద్ధ కార్యముల నొనర్చు దొంగవలె ఒకటి వెంట మఱియొకటిగా పెక్కు దుఃఖములను పొందుచున్నాడు. మఱియు

**సత్యాభిసంధానరతో విముక్తో**

**మహత్త్వ మాత్మీయ ముపైతి నిత్యమ్**

**మిథ్యాభిసంధానరతస్తు నశ్యే**

**ద్దృష్టం తదేతద్యదచోరచోరయోఃు.** (వివేక చూడామణి – 332,333)

సత్యమును, ధర్మమును ఆశ్రయించువాడు సదా గొప్పతనమునే పొంది విముక్తుడగుచున్నాడు. అనత్యమును, అధర్మమును



ఆశ్రయించువాడు నశించిపోవుచున్నాడు. దొంగకానివాడు, దొంగ అను ఇరువురిలో మొదటివాడు గొప్పస్థితిని బడయుటయు, జనులచే స్తుతింపబడుటయు, రెండవవాడు వినాశమును, దుఃఖమును బొందుటయు, జనులచే దూషింబడుటయు లోకములో చూడబడుచున్నది కదా!

కాబట్టి తాను కాని దేహాదులు తానని భావించు అజ్ఞాని నిషిద్ధ కార్యములనొనరించు దొంగతో సమానము. అతనిని అభినవ చోరుడని చెప్పవచ్చును. అట్టి హేయమగు చోరబుద్ధిని వదలివైచి, దేహాభిమానమును పరిత్యజించి నిజస్వరూపమగు ఆత్మయే తానని సదా భావించుచు జీవుడు మహోన్నతమగు ఆత్మస్థితిని బడసి కృతార్థుడు కావలెను. అసంగమను శస్త్రమును ధరించి దేహాది దృశ్యవస్తువులందు తగుల్కొనక అప్రమత్తుడై యుండవలెను.

కమలము నీటియందు పుట్టినను కమలపత్రము తనపై బడిన నీటిబొట్టుతో అంటుకొనదు. సాలెపురుగు అల్లిన వలయందు తక్కిన పురుగులు చిక్కుపడిపోవునేగాని సాలెపురుగు చిక్కుకొనదు. నిరంతరము ఆ వలపైననే తిరుగుచున్నను దానిలో చిక్కుపడకుండ చూచుచుండును. పెద్దపెద్ద మిల్లులలో ఫ్యాక్టరీ డ్రైవరు ఇంజను స్టార్టుచేసి వేలకొలది చక్రములు తిరుగుటకు తానే కారకుడై, వేగముగ తిరుగుచున్న ఆ చక్రముల ప్రక్కనే సంచారము సల్పుచు, వానిలో తగుల్కొనకుండ బహు చాకచక్యముతో మెలంగుచుండును. ఇదియే అసంగము.

అట్లే ఈ ప్రపంచములో జ్ఞానియగువాడు ఉపాధితో, దేహేంద్రియాదులతో అనేక కార్యము లాచరించుచున్నను అసంగముయొక్క దృఢాభ్యాసమువలన దేనితోను తగుల్కొనక నిజస్వరూపమగు ఆత్మయందే నిలుకడ కలిగియుండును. అజ్ఞాని ఆ దేహేంద్రియాదులతో ఐక్యమొంది, 'నేనే దేహము' అని భావించుచు, దానితో తాదాత్మ్యమును బడసి, దేహాభిమానము వలన నానా బాధలను పొందుచుండును. కాబట్టి తాను కాని దేహాత్మబుద్ధిని బహిష్కరించి ఆనందసాగరంలో మునుగుదురుగాక.

# నిజానిజములను తెలుసుకొనుటలో గల ప్రయాస

– శ్రీ సద్గురు మలయాళస్వాములవారు

దీనిని గుఱించి అనేక సభలలో సుమారు అయిదడుగుల యెత్తుగల ఒక స్తంభము పైనగాని, గోడపైనగాని ఒక అద్దమును పెట్టి జనులకు చూపడమైనది. కుడి చెవిపైనగాని లేక ఎడమ చెవిపైగాని మంచి పుష్పము లేక మఱేదేని సుందర వస్తువును పెట్టి చూపడమైనది. అద్దములో చూచునపుడు ఎడమ చెవిపై పెట్టబడిన వస్తువు కుడి చెవిపై ఉన్నటులను, లేక కుడి చెవిపై పెట్టబడినది యెడమ చెవియందున్నటులను కనబడును.

దీనిని యెవరైన యిపుడు గూడా చూడవచ్చును. ఎట్టి మేధాశక్తిగలవారికైనను, ప్రజ్ఞాశాలికైనను, వేదముల సాంతముగా చదువుకొన్న పండితవర్యునికైనను, యేమియు చదువని పామరునకైనను, పరమయోగికైనను, గోపాలురకైనను యీలాగున గోచరించును.

ప్రత్యక్షముగా యెవరైనా పరీక్షించుకొనవచ్చును. ఇదియే మాయ, అవిద్య, అజ్ఞానము, ప్రకృతి యొక్క వికృతి, లేక శక్తి అని గ్రహించు కొనవచ్చును. అద్దములో చూచుకొని దీనిని యెవరున్ను నివృత్తి చేసుకొనజాలరు. ఓహో! మాయ మహిమ యిట్టిదిగదా! అయితే దీని సత్యము తెలుసుకొనుటకు ఒక్క ఉపాయముగలదు. అద్దములో చూడక, దానినుండి ముఖమును తప్పించి తన చేతిలో తాను పెట్టిన పుష్పాదులు కుడి చెవిపై ఉన్నవా! లేక యెడమ చెవిపై యున్నవా! అని చేతితో యెత్తిచూచిన, యిదియేమి ఆశ్చర్యము! కుడి చెవిపై పెట్టిన పుష్పము నాకు యెడమ చెవిపై యున్నటులను అద్దములో కనబడినదే, యెంత ప్రజ్ఞతో అపుడాలోచించినను నిజము తెలియకపోయినదే. అద్దమువైపు



చూడక యిపుడు చేతితో యెత్తి చూచినపుడు సత్యము గోచరమైనదిగదా" అని పరమాశ్చర్యము గలుగును.

ఇదియే సృష్టియొక్క వైచిత్ర్యము. కావున దృశ్యముపై, దేహముపై, యింద్రియములపై, మనస్సుపై, బుద్ధిపర్యంతముగల దేనిపైన అయినను దృష్టిగలవానికి యిది అంతయు విపరీతముగానే కనిపించును. సాక్షియగు ఆత్మయందు లేక ఈశ్వరునియందు, లేక బ్రహ్మమునందు నిలకడ గలుగునపుడే సత్యము బయటపడగలదు. నిజము అపుడే గోచరించును. తక్కినవారందరికిని ఉన్నది లేనట్లున్ను, లేనిది ఉన్నట్లున్ను భాసించును. కావున ఆత్మజ్ఞానము గలిగి దానియందు నిలకడ సిద్ధించువఱకు సత్యము తెలియదు. కావుననే గీతయందు కృష్ణభగవానుడు యీ దిగువ రీతి తెలుపుటకు కారణమైనది.

**ప్రవృత్తిం చ నివృత్తిం చ కార్యాకార్యే భయాభయే ।**
**బన్ధం మోక్షం చ యా వేత్తి బుద్ధిస్సాపార్థ ! సాత్త్వికీ ॥ గీ॥అ॥18-30**

ఓ అర్జునా! ఇది ప్రవృత్తిమార్గము. ఇది నివృత్తిమార్గము. ఇది చేయతగనిది. ఇది చేయతగినది. ఇది భయమును గలుగచేయునది. ఇది అభయము నొసగునది. ఇది సంసార బన్ధమును గలుగజేయునది. ఇది సంసారబంధ నివృత్తిరూప మోక్షమును ఒసంగునది. అను ఇట్టి సత్యము యే బుద్ధిచేత తెలియబడుచున్నదో, ఇది సాత్త్విక బుద్ధియని గ్రహించుకొనుము.

ఇచట త్రిగుణ స్వభావముగల బుద్ధిని గూర్చి చెప్పుటవల్ల సాత్త్విక బుద్ధియని చెప్పబడినదేగాని, నిజముగా అది సత్యబుద్ధియనియే గ్రహించుకొనవలయును. ఏలన! సత్త్వ రజస్తమస్సులు మూడున్ను ప్రకృతిలో చేరినవే.

**అధర్మం ధర్మమితి యా మన్యతే తమసాఽవృతా ।**

**సర్వార్థాన్విపరీతాంశ్చ బుద్ధిస్సా పార్థ । తామసీ ॥ గీ॥అ॥18-32**

ఓ అర్జునా ! ఏ బుద్ధి అజ్ఞానముచేత ఆవరింపబడినదై అధర్మమును ధర్మమనియు, ధర్మమును అధర్మమనియు సమస్త పదార్థములను విపరీతములుగా తెలుసుకొనుచున్నదో, అట్టి బుద్ధి తమోగుణ ప్రధానమైనది. సమస్త శాస్త్రముల సారమంతయు యీ రెండు శ్లోకములలో శ్రీకృష్ణభగవానుడుపదేశించెను. మరియు పదహారవ అధ్యాయమున "ప్రవృత్తించ నివృత్తించ జనాన విదురాసురాః" అని అసుర స్వభావముగలారి లక్షణము నిరూపించబడినది. పైశ్లోకమున 'ప్రవృత్తించ నివృత్తించ' అని సత్త్వగుణబుద్ధియే నిజముగా తెలుసుకొనగలదనియు, తమోగుణబుద్ధి తెలుసుకొనజాలదనియు తెలిపిన దానినే యిచట అసుర స్వభావముగల జీవులుగాక దైవగుణములుగల జీవులే తెలుసుకొనగలరని మనము గ్రహించుకొనవలయును. ఇచట దైవగుణమనగా దైవభావములో నిలకడ గలిగియుండుటయని అర్థము. అట్టివారికే సాధ్యపడునని నిశ్చయించు కొనవలయును. మఱియు యీ శ్లోకముయొక్క ద్వితీయ పాదమును గూడా కలిపి చదువునపుడు-

**ప్రవృత్తించ నివృత్తించ జానా న విదురాసురాః ।**

**న శౌచం నాపి చాచారః నసత్యం తేషు విద్యతేః గీ॥అ॥16-7**

అసుర స్వభావముగలవారికి బాహ్యాభ్యన్తరశుద్ధిగాని, సదాచార ప్రవృత్తిగాని, సత్య వాక్యముగాని తెలియవని గ్రహించుకొనవలయును. ఈ సత్యమును దీర్ఘముగా ఆలోచించిన యిపుడు సత్య ప్రవర్తకులని, సదాచార నిష్ఠులని, అనుష్ఠానపరులని తలంచు కొందఱిలో గూడా యెన్నియో లోపములు కనపడుచున్నవి.

వీనిని ప్రజ్ఞతో ఆలోచించి సవరణ చేసుకొనేలాగున ముముక్షువులు,



జిజ్ఞాసువులు, విరక్తులు యత్నించుకోవలయును. లేనిచో సన్మనము పాడైపోవును. ఆ విషయమునే శ్రీ పతంజలి మహర్షి తన యోగశాస్త్రములో ఒక్క సూత్రములో నిర్ణయించినారు.

**సూ ॥ అనిత్యాశుచిదుఃఖానాత్మసు నిత్యశుచి సుఖాత్మఖ్యాతి రవిద్యా. తా ॥** (అవిద్య, అజ్ఞానము, తమస్సు, మాయ వాటియొక్క స్వభావము ఇందు నిరూపించబడినది) అనిత్య వస్తువునందు సత్యబుద్ధియు, సత్యవస్తువునందు అనిత్య బుద్ధియు, అశుద్ధ వస్తువునందు శుచిత్వబుద్ధియు, శుద్ధమైనదానియందు అశుద్ధ బుద్ధియు, దుఃఖమయమగు సంసారమందు సుఖత్వబుద్ధియు, శాశ్వత సుఖస్వరూపమైన ఆత్మయందు దుఃఖత్వ బుద్ధియు, అనాత్మస్వరూపములగు దేహేన్ద్రియాదులందు ఆత్మబుద్ధియు, సత్యజ్ఞానానందమగు ఆత్మయందు ఈశ్వరునియందు, బ్రహ్మమందు అనాత్మ బుద్ధియు గలిగియుండుటయే అవిద్యయొక్క స్వరూపము. దీనిలోగల ఒక్కొక్క పదమును దీర్ఘముగా విచారించిన మాయయొక్క స్వరూపము తెలుసుకొనగలరు.

కావుననే స్వబుద్ధిచేత శాస్త్ర విచారము చేసి సత్యమును తెలుసుకొనుటకు సాధ్యము కాదని శాస్త్రము నిర్ణయించడమైనది. ఏలన! బుద్ధి త్రిగుణాత్మకమైనది. దానిననుసరించియే అది నిర్ణయించునుగాని, త్రిగుణాతీతమగు సత్యమును, దైవమును అది యెట్లు నిర్ణయించగలదు! ఒక్క రంగులో ఒక వస్తువుగలదని తలంచడు. మీరు నీలము, ఎరుపు, పసుపు రంగులు గల అద్దము ద్వారా జూచిన, మీరు పెట్టుకొన్న కంటి అద్దము ననుసరించియే అది గోచరించును. తెల్లద్దము ద్వారా జూచిన అది నలుపో,యెరుపో,పసుపో,తెలుపో మీకు కనిపించును. లేక ఒక దీపమునకు మూడు రంగులుగల అద్దములమర్చినచో దీపము స్వప్రకాశమైనదిగాయుండినను, అద్దములయొక్క రంగులననుసరించి నీలమో, యెరుపో, పసుపో రంగులతోకూడినదిగా అది కనపడును.

కావున త్రిగుణములతోగూడిన హృదయము త్రిగుణాతీతమగు మాయనుండి త్రిగుణాతీతుడగు ఈశ్వరుని, ఆత్మను దర్శించుటకు, పొందుటకు ఉపాయము శ్రీకృష్ణభగవానుడు ఉపదేశించెను.

**దైవీ హ్యేషాగుణమయీ మమమాయా దురత్యయా ।**
**మామేవయే ప్రపద్యన్తే మాయామేతాం తరన్తితే ॥ (గీత. 7.14)**

ఓ అర్జునా ! యీ త్రిగుణాత్మకమైన నా యొక్క ప్రకృతి (మాయ) దేవసంబంధమైనది. అనగా నావలన కలిగినది. కనుక సామాన్యులు దాట శక్యముగానిదిగానుంటున్నది. అయితే ఎవరు నన్ను శరణు పొందుచున్నారో, వారు యీ మాయను దాటుచున్నారు.

పడవనాశ్రయించినవారు నదిని, ఓడను ఆశ్రయించినవారు సముద్రమును దాటుట లేదా ! శ్రీ దాత్తాత్రేయులును అవధూత గీతయందు మొట్టమొదటనే దీనిని తెలిపిరి.

**ఈశ్వరానుగ్రహాదేవ వుంసామద్వైతవాసనా।**

**మహాభయ పరిత్రాణా ద్విత్రాణాము పజాయతే**

ఈశ్వరానుగ్రహమువలననే మహాభయంకరమగు యీ సంసార సాగరమునుండి జీవులు తరించగలరు. రక్షణ లేనివారిని ఆ యీశ్వరానుగ్రహమొక్కటియే రక్షించును. అనేక శాస్త్రములు ఈ సత్యమునే బోధించుచున్నవి. కావున ఆ పరమేశ్వరునియందు భక్తి గలిగి యుండుడు. అపుడు జ్ఞానమున్ను, మోక్షమున్ను, సర్వమున్ను సిద్ధించును.

## దీపావళి శుభాకాంక్షలు

**వేదాన్తభేరి పాఠకులకు, వ్యాస రచయితలకు, పోషకులకు, మా దీపావళి శుభాకాంక్షలు**

# శ్రీరామకృష్ణ కథామృతం

**– శ్రీ రామకృష్ణ వరమహంస**

**శ్రీరామకృష్ణుడు :** పిందె బైటికి రాగానే పూవు రాలిపోవును. భక్తి కలిగిన ఈశ్వర లాభము కలుగును. సంధ్యాది కర్మలు ముగియును. ఇంటి కోడలు చూలాలు అయినచో అత్తగారు ఆమె పనిని తగ్గించును. నిండు నెలలైనచో ఆమెచే ఏ పనులు చేయించదు. బిడ్డ పుట్టిన తరువాత బాలింతకు బిడ్డను చూచుకొనుటతప్ప వేరు పనియుండదు.

ఆ విధముగనే భగవల్లాభమైన పిదప ఇతర పనులేమియు వుండవు. నీవు తూలుచు నడచినంత మాత్రముననే సరిపోదు. తీవ్రమైన వైరాగ్యము కావలెను. నీలో గట్టి పట్టుదలయే లేదు. పేలపిండిలాంటి స్వభావము నీది. మనోబలము లేదు, శక్తి లేదు, భక్తికుదురుటెట్లు? లేచి నడుము కట్టుము, కార్యము సాధింపుము.

సోదరా! సంతోషముగ భగవంతుని పట్టుకొనియుండుము. ఏదో ఒకనాడు వానిని పొందగలవు, వలయునది తీవ్ర వైరాగ్యము. తీవ్ర వైరాగ్యము అలవడుట లేదని ప్రశ్నింతువా? అందులకు కారణము కలదు. నీలో కోర్కెలు ఇంకను కలవు. మా ఊరిలో చూచితిని. రైతులు ఎంతో కష్టపడి చేలకు నీళ్ళు పెట్టుదురు. ఎంత కష్టపడినను ఒకరి చేనులో నీళ్ళు నిలువలేదు. పరిశీలింపగ నీళ్ళు కన్నముగుండ బైటికి పోవుచుండెను. ఈ విధముగనే – ఎంత జప తప సాధనలు చేసినప్పటికినీ ఈ కోర్కెలు అనెడి కన్నము గుండా అన్నియును బయటికిపోవును.

త్రాసులోని ఒక పళ్ళెంలో ఎక్కువ బరువుండినచో ముల్లు నిటారుగా నుండక బరువున్నవైపునకే వంగుచుండునుగదా! కామినీ కాంచనములే ఎక్కువ బరువుగల పదార్థములు. కామినీ కాంచనముల ద్వారానే సాధకులు యోగభ్రష్టులగుదురు. గాలిలో దీపము చలించినట్లు, గాలి లేనిచోట వెలుగొందు దీపమువలె యోగులు నిశ్చలముగ నుందురు. మనస్సు చంచలముగ ఢక్కా, ఢిల్లీ, కూచ్, బీహార్ మొదలగు నాల్గువైపుల పరుగిడుచున్న లాభమేమి? ఆ మనస్సును ఏకాగ్రము చేయవలెను సుమా!

ఒక వస్త్రము ధర ఒక్క రూపాయి అయినచో నీవు పూర్తిగా రొక్కమును చెల్లించినంతనే అంగడివాడు నీకా వస్త్రమును ఇచ్చునుగదా! కొంచెము విఘ్నము కలిగినను యోగము సిద్ధింపదు. టెలిగ్రాపు తంతులు కొంచెము తెగినను సరే సమాచారము చేరదుకదా! నీవు సంసారమున నున్నందున తప్పేమియు లేదు. కానీ కర్మఫలమును సంపూర్ణముగ భగవంతునికే సమర్పింపవలెను సుమా! ఇంకొక విషయమును జ్ఞప్తియుంచు కొనుము. భక్తిని కోరుట కోర్కెలలో చేరదు. తన భక్తిని ప్రార్థింపదగును.

ఓ మనసా ! ఆలోచించి చూడు. యథార్థముగ నీవారెవరును లేరు. అనవసరముగ ఈ ప్రపంచములో తిరుగుచున్నావు. ఈ మాయకులోనై నీవు కాళికాదేవిని మరువవద్దు. రెండుమూడురోజులపాటు లోకులు నిన్నొక యజమానిగ గౌరవింతురు. అటుపై కాలాంతకుడగు యముడు రాగానే నిన్ను వారికి అప్పగింతురు. నిన్నంతగ ప్రేమించిన నీ భార్యయు నీ తోడు రాదు. మీదు మిక్కిలి నీ శవమును పంపివేసి అంటు అని చెప్పి పేడ నీళ్ళు చల్లుదురు. కాన భగవచ్చింతనలో కాలము గడుపుము.

# రాజయోగం - ఆరు పాఠాలు

## పాఠం - 5

– శ్రీ స్వామి వివేకానంద

**ప్రత్యాహారం – ధారణ:** "మార్గాలు వేరైనా నన్ను కోరేవారు నన్ను చేరుతారు. అంతా నన్ను పొంది తీరాల్సిందే" అని శ్రీకృష్ణపరమాత్మ చెబుతాడు. **ప్రత్యాహార మంటే బహుముఖాలుగా ప్రవహించే మనసును మళ్లించి ఏకాగ్రం చేయటం.** అలా చేసి ఒకే విషయంలో దాన్ని నిలపటం. మనసును దాని యిష్టం వచ్చినట్లు పోనివ్వటం మొదటి మెట్టు. **ఆ మనసును ఊరక చూస్తూ ఉండు. అది ఏమాలోచిస్తుందో చూడు.** మనసు ఆత్మ కాదు, జీవుడూ కాదు. అది సూక్ష్మభూతాల సమాహారం వల్ల ఏర్పడింది. అది మన చేతిలోని సాధనం. నాడీశక్తుల వల్ల మనం దాన్ని ఎలా ఉపయోగించుకోవచ్చో తెలుసుకోవచ్చు.

స్థూల శరీరం ఆ మనసు వైషయిక రూపం. సాధకుడు స్థూలసూక్ష్మ శరీరాల కన్నా వేరైనవాడు. శాశ్వతం – అవికారం –సాక్షీభూతం అయిన ఆత్మ స్వరూపులం మనం. శరీర మన్నది భౌతిక ఆకారంగా రూపొందిన మనసు. ఎడమ ముక్కు ద్వారా గాలి ఆడుతున్నప్పుడది విశ్రాంతి కాలం. కుడి ముక్కు ద్వారా ఆడుతున్నప్పుడు పనిచేసే కాలం. రెండు ముక్కుల ద్వారా ఆడుతున్నప్పుడు ధ్యానం చేసే కాలం. మనం శాంతంగా రెండు ముక్కులతో గాలి పీలుస్తున్నప్పుడు, ప్రశాంతంగా ధ్యానం చేసుకోవటానికి అనువైన స్థితిలో ఉన్నామని గ్రహించాలి. మొట్టమొదటనే చిత్తాన్ని కేంద్రీకరించటానికి ప్రయత్నించటం వల్ల లాభం లేదు. వృత్తి నిరోధం దానంతట అదే సంభవిస్తుంది.

బొటనవ్రేలితో – తర్జనితో రెండు ముక్కులను మూయటం ద్వారా, ప్రాణాయామాన్ని కొంతకాలం అభ్యాసం చేసిన తర్వాత వ్రేళ్లు

ఉపయోగించకుండా, భావన వల్లనే మనం కోరినట్లు నాసారంధ్రాలను మూయటం – తెరవటం సుసాధ్యమవుతుంది.

ఈ స్థితికి వచ్చిన తర్వాత ప్రాణాయామంలో కొంచెం మార్పు చేయాలి. సాధనకు ఓంకారం కన్నా ఇష్టమైన నామం ఉంటే పూరక రేచకాల్లో ఓంకారానికి బదులు దాన్ని ఉపయోగించాలి. కుంభకంలో మాత్రం హూం అని ధ్యానించాలి.

కుంభించిన వాయువును ప్రతి ఉచ్చారణతో కూడా కుండలినీ తలమీద అదమాలి. అలా అదుముతూ కుండలినీ మేలుకొంటున్నట్లు భావించాలి. పరమాత్మతో లేదా ఈశ్వరునితో నువ్వు అభిన్నుడవని భావించాలి. ఇలా కొంతకాలం అభ్యాసం చేసిన తర్వాత సాధారణ పరిస్థితిలో ఎవరో మనిషి వచ్చినట్లు మనమెంత చక్కగా గమనిస్తామో, ఏవో ఆలోచనలు రానున్నట్లు అవి ఎలా మొదలౌతాయో, ఏ స్వరూపంలో ఉంటాయో మనకు చక్కగా తెలుస్తుంది. మనం మన మనసులకన్నా వేరని, మనకన్నా ఈ వృత్తులు వేరని, మనం వేరని వివేకించటం మనకు బాగా చేతనైనప్పుడు ఈ స్థితి సంభవిస్తుంది. ఈ వృత్తుల చేతిలో నువ్వు చిక్కరాదు. నువ్వు వాటికన్నా వేరుగా నిల్చోవాలి. వాటంతట అవే ఆగిపోతాయి.

ఈ పవిత్ర వృత్తుల్ని అనుసరించు. వాటితో కొంతదూరం వెళ్ళు అవి అణగిపోయిన తర్వాత, నువ్వు ఆశ్రయం పొందినది సర్వశక్తి అయిన ఈశ్వరుని యందని గ్రహిస్తావు. ఇదే అతీంద్రియ స్థితి. వృత్తి అణగినప్పుడు ఆ వృత్తి ననుసరించి నువ్వు కూడా దాంతోపాటు లయించిపో.

కాంతి పరివేషాలు అంతర్జ్యోతి చిహ్నాలు. అవి యోగులకు కనిపిస్తాయి. ఒక్కొక్కప్పుడు మనకు ఒక ముఖంలా, దానిచుట్టూ జ్వాలలు వ్యాపించి వున్నట్లు కనిపించవచ్చు. ఆ జ్వాలల్లో కనిపించిన ముఖానికి



సంబంధించిన మనిషి శీలాన్ని మనం ఎలాంటి పొరపాటు లేకుండా నిశ్చయింపవచ్చు. ఒక్కోమారు మన ఇష్టదైవం కనిపించవచ్చు. ఈ ఇష్టదైవం మీద మన మనసును లగ్నం చేయవచ్చు. మనం మిగతా ఇంద్రియాలతో విషయ పరిజ్ఞానం పొందుతున్నా, కన్నులతోనే ఎక్కువగా పొందుతుంటాం. ఈ విషయజ్ఞానం పూర్తిగా భౌతికం కాదు, సగం మాత్రమే భౌతికం. మనం కల్పన లేకుండా భావింపలేం. కాని జంతువులు భాషా సహాయం లేకుండానే విషయజ్ఞానాన్ని పొందుతున్నట్లు కన్పించటం వల్ల, వృత్తికి – విషయాలకు విడదీయరాని సంబంధముందని మనం చెప్పజాలం.

**యోగంలో భావనను పరిశుద్ధంగా – పవిత్రంగా ఉంచుకోవాలి.** మనకున్న భావనాశక్తి మనిషిని బట్టి భేదిస్తుంది. ఎవరికి ఏది స్వాభావికమో, వారా పద్ధతిని జన్మాంతర కర్మ పరిపాకం వల్ల అనుసరిస్తారు. ఈ జన్మలో మనం యిలా ఉన్నాం. బౌద్ధులు ఇలా అంటారు. ఒక దీపాన్నుండి మరొకటి వెలుగుతుందని. దీపం వేరైనా వెలుగు మాత్రం ఒక్కటే.

నువ్వు సంతుష్టిగా ఉండాలి. ధైర్యశాలిగా ఉండాలి. ప్రతిదినం స్నానం చేయాలి. సహనం–శౌచం–శ్రద్ధ కలిగి ఉండాలి. అప్పుడే నువ్వు నిజమైన యోగివి అవుతావు. త్వరపడవద్దు. నీకు ఏవైనా సిద్ధులు కలిగితే, అవి రాజమార్గాలు కావని –ప్రక్కదారులని గ్రహించాలి. రాజమార్గం నుండి నిన్నవి ఆకర్షించకుండా చూసుకోవాలి. వాటిని కాదని నీ లక్ష్యమైన ఆత్మనే గట్టిగా పట్టుకో. శాశ్వత పదార్థం కోసం అన్వేషణ కొనసాగించు. సత్పదార్థ లాభం వల్లే చిత్తవిశ్రాంతి లభిస్తుంది. నిర్వాణం లభిస్తుంది. సర్వం స్వాధీనం అవుతుంది. అప్పుడు మరొక్క దానికై ప్రయత్నించే అవసరమే ఉండదు. మనకప్పుడు పునరావృత్తిరహిత శాశ్వత ముక్తి, సంపూర్ణత్వం కలుగుతాయి. సచ్చిదానంద స్వభావులం అవుతాం.

# ప్రియవచనమ్

– శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు

**ప్రియవాక్యప్రదానేన సర్వే తుష్యన్తి జంతవః ।**

**తస్మాత్తదేవ వక్తవ్యం వచనే కా దరిద్రతా ॥**

ఇతరులకు సంతోషమును గలిగించెడి వాక్యమును ప్రియవాక్య మందురు. ప్రతి వ్యక్తితో మాట్లాడినపుడు ప్రియముగా మాట్లాడవలెను. సమస్యలలో చిక్కుకొని బాధపడువారితోను, అనారోగ్యముతో బాధ పడుతున్న వారితోను, వృద్ధులతో సంభాషించినపుడు ప్రియవాక్యము లుపయోగించిన వారు బాధల నుండి విముక్తులై సంతోషమును పొందెదరు. ప్రియవాక్యములు పలికి మోసగించరాదు. వంచన చేయరాదు. ప్రియవాక్య పరిపాలనను గీతలో వాచిక తపస్సుగా గీతాచార్యులు చెప్పియున్నారు.

**అనుద్వేగకరం వాక్యం సత్యం ప్రియహితంచ యత్ ।**

**స్వాధ్యాయాభ్యసనం చైవ వాఙ్మయం తప ఉచ్యతే ॥**

మనం పలికిన వాక్యము నాల్గు విశేషములతోగూడి యుండవలెను యని చెప్పియున్నారు. అనుద్వేగకరం వాక్యం – ప్రాణులకు భయోత్పాతమును, మనస్సున కాందోళన కలుగుజేసినదియు, దుఃఖమును పొందింపజేసిన వాక్యముగా నుండరాదు. ఆ వాక్యముగూడ సత్యముగా నుండవలెను. సత్యశీలత కష్టదాయకముగా నుండునదే అయినను వర్తమాన పరిస్థితిని గమనించి సూక్ష్మ విషయమును గ్రహించి నడచుకొనవలెను.



**సత్యంబ్రూయాత్ప్రియం బూయాన్న బ్రూయాత్సత్యమప్రియమ్।**

**ప్రియంచ నానృతం బ్రూయాదేష ధర్మస్సనాతనః ॥**

ప్రాణులకు దుఃఖమును, ప్రాణహానిని, సర్వస్వము నాశమును కలుగజేసెడి వాక్యము సత్యమైనను, దానిని పలుకగూడదని శాస్త్ర వాక్యము. ప్రియంగా వాక్యముండాలని సదా అసత్య భాషణము చేయరాదు. ఈ సూక్ష్మ రహస్యమును తెలిసికొని ప్రవర్తించుటే సనాతన ధర్మమని చెప్పియున్నారు. హితం – ఆప్తవాక్యం. పలికిన వాక్యమును ఇతరు లనుసరించిన భవిష్యత్తులో మేలును గలిగించునదిగా నుండవలెను. కీడును గలిగించునదిగా నుండరాదు. వాక్ ద్వారా పరుషమైన, భయంకరమైన కఠిన వాక్యములు పలుకుచూ, ఇతరులను సదా నిందించుచూ, కొండెములను చెప్పుచూ, అవమానించుచూ, బాధలను కలిగించువారు పాపాధిక్యతచే జన్మాంతరమున పక్షి మృగాదుల జన్మమును బొందుదరని శాస్త్రము.

**“న హీదృశం సంవననం త్రిషు లోకేషుకించన ।**

**దయా మైత్రీచ భూతేషు దానం చ మధురాచవాక్ ॥”**

స్వర్గ, మర్త్య, పాతాళ లోకముల యందు అర్థాత్ పదునాల్గు భువనముల యందున్న జీవులయందు దయా, మైత్రీ, దానం, మధురమైన వాక్యుంచిన ఎడల అందరూ యానందమును పొంది. వశమగుదురు వీటికి సమానమైనదేదీ లేదు. “దయగల హృదయమే భగవన్నిలయమ”ని మహర్షి మలయాళ సద్గురు స్వాములవారు చెప్పియున్నారు. ‘దయాభూతేషు’ అని భగవద్గీత. దయకు సమమైన పుణ్యము లేదని శాస్త్రము. మైత్రీ అనగా స్నేహభావము. ప్రారంభ దశలో సత్యగుణ సంపన్నులతో స్నేహము చేసిన తదుపరి స్నేహభావము సకల జీవులయందునభివృద్ధి చెందును. “అదాన దోషేణ భవేద్దరిద్రః” దానము లేని కారణముగా దరిద్ర దశ

పొందును. పాపపు పనులు చేయును, దుఃఖముల పాలగును. కనుక మానవుడు శక్తిననుసరించి దానగుణము గలిగియుండవలెను. మధురమైన వాక్కులు సదా గలిగియుండవలెను. ఇవి అభ్యాసవశముచే అలవడును. వీటి వలన మానవుడు శాంతి, సుఖమును, ఉత్తమ జన్మను పొందును. తననాశ్రయించిన వారును శాంతి సుఖములను పొందుదురు. ఈ విధముగా మహాభారతము అనుశాసనిక పర్వము తెలుపుచున్నది.

వర్తమాన పరిస్థితులలోను గృహయజమాని భార్య, పిల్లల యందు ప్రతిదినం కటువుగా మాట్లాడుట, తిట్టుట, కొట్టుట మొదలగు పనుల వలన యజమానికి శాంతి సుఖముండదు. ఇంటివారికి శాంతియుండదు. ఇంటి వారు యజమానిపై ద్వేష, కోపములు పెంచుకొని, ఇంటిలో పనులు సరిగా జేయక, అతిథి అభ్యాగతులను సరిగా చూడక, దైవపూజ, జపధ్యానములయందు మనస్సుంచక పాపమునకు గురై మానవ జీవిత కర్తవ్యమును కోల్పోవుచున్నారు. రాజకీయ రంగంలో గూడా యీ కటుభాషా ప్రవర్తన వలననే పరస్పర విద్వేషములను పొంది ప్రాణములను కోల్పోవుచున్నారు.

ఆశ్రమాలలో గూడా యీ మృదుభాష లేనందుననే గురుశిష్యులలో పరస్పర వైషమ్యములు గలుగుట, ఎవరి పాత్రని వారు పోషించు కొనుట లేదు. భక్తులు నామమాత్రము ఆశ్రమాలకి వచ్చుట, పోవుట జరుగును. గురువులయందు సంపూర్ణమైన భక్తి ప్రపత్తులు లేకపోవడానికి కటుభాషా ప్రయోగములే కారణము.

దేవాలయాలలోను గూడా దేవాలయ పాలక వర్గము, దేవుని పూజారులు, భక్తులయందు కటుభాషా ప్రయుక్త అపశబ్దముల ప్రయోగము వలననే భక్తులకు దైవమునందు ప్రీతిపోవుచున్నది.

జనులు పొరపాట్లు చేసినచో సజ్జనులు, మహాత్ములు



బుద్ధిమంతులారా ! అని వారిని సంబోధించి, పిలిచి చెడుపనులు చేయుట తగదుయని నీతులు బోధించి చెప్పెడివారు. ఆ కారణముచే అధర్మపరులును జ్ఞానమును పొంది ధర్మపరులుగా మారెడివారు. పనికిమాలిన వాడా ! మూర్ఖుడా ! అనే సంబోధన వలన అజ్ఞానులై తన మూర్ఖతను పెంచుకొనెదరు. కావున మధుర వాక్ మానవోన్నతికి మూలము.

**"కామాన్‌దుగ్ధే విప్రకర్షత్యలక్ష్మీం కీర్తిం సూతే దుష్కృతం యా హినస్తి ।**
**తాంచాప్యేతాం మాతరం మంగళానాం ధేనుం ధీరాः, సూనృతాం వాచమాహుः॥**

సుందర వాణి కామధేనువుతో సమానము. ఈ మధురవాణి మనోవాంఛిత కోరికలను తీర్చునది, దారిద్ర్య దశను నాశము చేసేది, కీర్తిని విస్తారముగా వ్యాపింపజేసేది, పాపమును పరిహారము జేసేది, సమస్త శుభములను చేకూర్చేది. కావున మధుర వాణిని అభ్యాసము చేయుట శ్రేయోదాయకము. ఈవిధముగా ఉత్తర రామచరితము దెలిపినది.

**"హీనేభ్యోఽ పి న యుంజీత త్వంకారం కర్హిచిద్బుధः ।**
**త్వం కారోవా వధోవాపి గురుణాముభయంసమమ్"॥**

స్కంద పురాణం ఈవిధముగా తెలుపుచున్నది. బాగుగా చదువుకొన్న ప్రజ్ఞాశాలురుగాని, పండితులుగాని, సదాచారులుగాని, స్వామిజీలుగాని ఎంత తక్కువ వారికైన ఏకవచన ప్రయోగము, ఒరే ఇత్యాది ప్రయోగములు చేయరాదు. తన విద్వత్తుకే అది భంగము. ఉన్నతమైన వారికి, మేధాసంపన్నులకు, పదవులలో యున్నవారికి ఏకవచన ప్రయోగము చేసినచో వారిని చంపినట్లే అగును. ఏకవచన

ప్రయోగం, చంపుటతో సమానమని భావము.

హిరణ్యకశిపుడు, రావణాసురుడు, శిశుపాలుడు, కంసుడు మున్నగువారు పరుషమైన కఠిన వాక్యములు ప్రయోగించి వినాశము నొందిరి. ద్రౌపది, సీతమ్మగార్లు పరుష వాక్య ప్రయోగములు చేసి సాధ్వీమణులు సయితము కష్టములు నొందిరి. సామాన్య మానవుల విషయం చెప్పవలసినదేమున్నది. కావున ప్రియవాక్య, మధుర వాక్య పరిపాలనమే మానవునకు ఇహ పరలోకములలో శాంతిని కలుగజేయునది. **ఓం తత్సత్ ఓమ్**

## శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో – భాగవత సదస్సు

**1. 26-11-2018 నుండి 2-12-2018 వఱకు**

**పూజ్యశ్రీ సంపూర్ణానందగిరిస్వాములవారు (హైద్రాబాద్)**

**2. 16-12-2018 నుండి 22-12-2018 వఱకు**

**పూజ్యశ్రీ పరావిద్యానందగిరి స్వామిని వారు(యాచారం)**

**3. 16-1-2019 నుండి 22-1-2019 వఱకు**

**పూజ్యశ్రీ శివానంద సరస్వతిస్వామిని వారు (చైతన్య తపోవనం)**

**4. 23-1-2019 నుండి 29-1-2019 వఱకు**

**పూజ్యశ్రీ ప్రణవానందగిరి స్వాములవారు (లత్తవరం)**

**5. 13-2-2019 నుండి 19-2-2019 వఱకు**

**పూజ్యశ్రీ జ్యోతిర్మయానంద భారతి స్వామిని వారు (పాలకొల్లు)**

**6. 15-3-2019 నుండి 21-3-2019 వఱకు**

**శ్రీ శ్రీనివాస రామానుజదాసుగారు (కాళీవనాశ్రమము, నంబూరు)**

**ఇందులో పాల్గొనదలంచిన భక్తులు ఒక నెల ముందుగా జాబు వ్రాసి నివాస వసతికి అనుమతిని పొందవలెను.**

# శ్రీమలయాళస్వామి జీవిత విశేషాలు - 14
# గ్రంథ ప్రచురణలు

– డా।। సముద్రాల లక్ష్మణయ్య, (తిరుపతి)

తత్త్వాన్నీ, ధర్మాన్నీ ప్రచారం చేయడానికి ముఖ్య సాధనాలు గ్రంథాలు. వేదాలు, శాస్త్రాలు, పురాణాలు, కావ్యాలు వగైరా వాఙ్మయం ద్వారానే జ్ఞానవిజ్ఞానాలు ప్రచారంలోకి వస్తాయి.

భగవద్గీత ప్రస్థాన త్రయంలో ఒకటి. అది సామాన్యులకు సైతం అందుబాటులో ఉండే వేదాంత గ్రంథం. అది శ్రీకృష్ణుని ఉపదేశం. నేటికీ గీతాప్రశస్తి ఏ మాత్రం తగ్గలేదు. వివిధ మత ప్రవక్తలు గూడా గ్రంథాల ద్వారానే తమ తమ మత సిద్ధాంతాలను ప్రచారంలోకి తెచ్చారు.

స్వామి గోగర్భంలో ఉన్నప్పుడే శుష్క వేదాంత తమోభాస్కరం అనే ఉద్గ్రంథం రచించారు. వ్యాసాశ్రమ స్థాపనానంతరం అనేక ఆధ్యాత్మిక గ్రంథాలు రచించారు. గీతకూ, కొన్ని ఉపనిషత్తులకూ, నారద భక్తి సూత్రాలకూ స్వయంగా వ్యాఖ్యలు వ్రాసి ప్రకటించారు. వారి ఉపన్యాసాలు గూడా 'ధర్మోపన్యాసాలు' అన్న పేరుతో ఐదు సంపుటాలుగా వెలువడ్డాయి.

స్వయంగా వారు 57 గ్రంథాలు రచించారు. వీటిని వ్యాసాశ్రమ వజ్రోత్సవ సందర్భంలో 20 సంపుటాలుగా క్రోడీకరించి ప్రకటించడమైనది. అంతేకాక ప్రాచీనమైన యోగవాసిష్ఠాన్ని తాత్పర్య సహితంగా నాలుగు బృహత్సంపుటాలుగా ప్రచురించారు. యోగదర్శనం అనుభూతి ప్రకాశం, వివేకచూడామణి, శంకర విజయం మున్నగు

వాటికి విపుల వ్యాఖ్యలు సుప్రసిద్ధ పండితులచేత వ్రాయించి ప్రచురింప జేశారు. అందుబాటులో లేకుండా పోయిన బృహదారణ్యకం, ఛాందోగ్యం మున్నగు గ్రంథాలను పునర్ముద్రణకావించారు. మహాభగవద్గీత, బుద్ధచర్య మున్నగు వాటిని అనువదింపజేసి ప్రచురించారు.

గ్రంథ ప్రచురణకై చిత్తూరులో వ్యాసుని పేర ఒక ముద్రణాలయం నెలకొల్పారు. ఇలా వేదాంతగ్రంథ ప్రచురణలో ఆ దినాలలో ఇతర ధార్మిక సంస్థలకంటే వ్యాసాశ్రమం అగ్రగణ్యమై విరాజిల్లింది.

ప్రతి కార్తీక మాసంలోనూ ఒక నూతన గ్రంథం ప్రచురింప బడాలన్న వారి సంకల్పం ఫలించి శరపరంపరగా ఆనాడు పలు ధార్మిక గ్రంథాలు ముద్రితాలయ్యాయి. ఆశ్రమానికి వచ్చే భక్తుల విరాళాలతో ఆయా సంవత్సరాలలో ఖర్చులకుపోగా, మిగిలిన ధనాన్ని ఏదో ఒక ఉద్గ్రంథం ముద్రించడానికై వ్యయించేవారు. ఆ డబ్బు చాలకపోతే అప్పు తెమ్మనేవారు. అప్పు తెచ్చి గ్రంథాలు ప్రచురించి వాటి అమ్మకం ద్వారా వచ్చే ఆదాయంతో వెంటనే అప్పు తీర్చమనేవారు.

అప్పిచ్చినవారు గడువు తీరకముందే డబ్బు చెల్లించడం వల్ల మేము ఆశించిన వడ్డీ రాదు గదా! అని ఆక్షేపిస్తే ఆ గడువు మొత్తానికి ఎంత డబ్బు అసలు, వడ్డీ అవుతుందో అంతా గడువు తీరకముందే చెల్లించమనేవారు.

ఇలా శ్రీవారికి ఆధ్యాత్మిక గ్రంథాల ప్రచురణ పట్ల, వ్యాప్తిపట్ల ఉన్న ఆసక్తి అత్యద్భుతమై యుండేది. అందువల్లనే వ్యాసాశ్రమ గ్రంథావళి ఆ రోజుల్లో ఆంధ్రావని అంతటా విస్తృత వ్యాప్తి పొందింది. 'గీతా ప్రచారం మిన్నుంటింది.'





# స్మరణే తరణోపాయం

– భగవాన్ సత్యసాయిబాబా

**పాజిటివ్ – నెగెటివ్:** ఈనాటి మానవుడు భగవంతుడనే పాజిటివ్ తత్వాన్ని గుర్తించుకోలేక దేహభ్రాంతితో నెగెటివ్ జీవితాన్ని గడుపుతున్నాడు. ఏది నెగెటివ్? ఏది పాజిటివ్ ? అనిత్యమైన, లౌకికమైన వాంఛలపై ప్రయాణం చేసే మనస్సు స్వభావం – నెగెటివ్. మార్పు చెందని, కూర్పు చెందని దివ్యత్వంపై మనస్సును మళ్ళించడం – పాజిటివ్. "సత్యం త్రికాలాబాధ్యం". త్రికాలములందును మార్పు చెందనటువంటిదే సత్యం. అట్టి సత్యస్వరూపుడైన భగవంతుణ్ణి చింతించడమే పాజిటివ్. ఈ దేహాన్ని అనిత్యమైన, అశాశ్వతమైన, లోకసంబంధమైన వాంఛల నిమిత్తమై వినియోగించకూడదు. ఇట్టి సత్యనిత్యమైన ఆదర్శాన్ని అందించినది మీరా.

**సైంటిస్టు – నగర సంకీర్తన:** భగవన్నామంలో ఎంతో గొప్ప శక్తి సామర్థ్యాలు ఇమిడి ఉన్నాయి. అట్టి భగవన్నామాన్ని మనం పఠిస్తే చాలు, స్మరిస్తే చాలు తరించిపోతాము. ఒక పర్యాయం హైదరాబాద్‌లో సాయి భక్తులందరూ చేరి సాయినామ సప్తాహాన్ని నిర్వహించారు. చిక్కడపల్లి వద్ద నగరసంకీర్తన ప్రారంభం కావలసి యుండినది. ఆ సమయంలో భగవంతం భారత ప్రభుత్వానికి సైంటిఫిక్ అడ్వైజర్‌గా ఉండినాడు. నేను చెప్పాను అతనికి, "భగవంతం! సైన్సు, సైన్సు అంటూ 24 గంటలు ఊరికే సైన్సు జపం చేసే బదులు నీవు కూడా వెళ్ళి నగర సంకీర్తనలో పాల్గొను" అని. అతడు "స్వామీ ! మా సైన్సు దీనికి ఒప్పుకోదు" అన్నాడు. "సైన్సు ఏకత్వాన్ని అనేకత్వంగా విభాగం చేస్తుంది. కాని ఆధ్యాత్మికం అనేకత్వాన్ని ఏకత్వం గావిస్తుంది. Sci-

ence is split of Love, Spirituality is spirit of Love. ఇట్టి ఆధ్యాత్మికానందాన్ని నీవు పొందాలనుకుంటే వెళ్ళు నగర సంకీర్తనకు" అని మళ్ళీ చెప్పాను. అప్పుడతని భార్య కూడా "ఏమిటండీ, మీరీ పాడు సైన్సులో మునిగి పోతున్నారు. దీనివల్ల ఒక్క నిమిషమైనా శాంతిని పొందారా? కనుక స్వామి చెప్పినట్లు చేయండి" అన్నది.

ఇది కలియుగం. ఎంతటి సైంటిస్టు అయినా, ఎంతటి మేధావి అయినా పెద్దవారు చెప్పినది వినరు. కానీ భార్య చెప్పినది మాత్రం తక్షణమే శిరసావహిస్తారు. కనుకనే త్యాగరాజు "ఎంత నేర్చినా ఎంత జూచినా ఎంతవారలైన కాంతదాసులే" అని ఆనాడే చెప్పాడు.

సరే, ఒక టవల్ భుజంమీద వేసుకొని భగవంతం నగర సంకీర్తనకు వచ్చాడు. ఎంతదూరం నడిచాడంటే పది మైళ్ళ దూరం నడిచాడు. సాధారణంగా అతనికి పది నిమిషాలు నడిస్తే ఆయాసం వచ్చేది. కానీ ఆనాడు పది మైళ్ళు నడిచినా ఏమీ ఆయాసమనిపించలేదు. భక్తులు ఉస్మానియా యూనివర్శిటీ హాస్టల్ ముందు నుండి నగర సంకీర్తన చేసుకుంటూ వెళుతుంటే అనేక మంది హాస్టల్ విద్యార్థులు కూడా అందులో ప్రవేశించారు. అందరూ కలసి 'శివం' వచ్చారు. హారతి ఇచ్చారు, జేజేలు పలికారు. నేను శివంపై నిలిచి దర్శనమిచ్చాను. తరువాత భగవంతంను పిలిచి, "భగవంతం! ఎట్లా ఉంది నగర సంకీర్తన?" అని అడిగాను. "స్వామీ! దీనిని మా సైన్సు ఒప్పుకోదుకాని నాకెంతో ఆనందంగా ఉన్నది. చల్లని గాలిలో తీయని నామాన్ని స్మరిస్తూ వెళ్ళడమనేది హృదయానికెంతో హాయినిచ్చింది. నిత్యము ఈవిధంగా నేను నగర సంకీర్తనలో పాల్గొంటే నా ఆరోగ్యం కూడా బాగుపడుతుంది" అన్నాడు. అప్పుడు నేను "ఆరోగ్యం గూర్చి యోచించకు, ఆనందం గూర్చి యోచించు, ఆనందం కోసం పాటుపడు అన్నాను.



భగవన్నామము అన్నము లేకపోయినా ఆనందాన్ని చేకూర్చుతుంది. అంతేగాక రోగాలను నివారణ గావిస్తుంది. సంసార సాగరాన్ని దాటిస్తుంది. భగవన్నామ స్మరణచేతనే ఈ సంసారమనే సముద్రాన్ని సులభంగా దాటడానికి వీలవుతుంది. పడవ నీళ్ళలో ఎంత కాలం ఉన్నా ప్రమాదం లేదుకాని పడవలోకి నీళ్ళు ప్రవేశిస్తే పడవ మునిగిపోతుంది. అదేవిధంగా మీరు సంసారంలో ఉండవచ్చును. కానీ సంసారం మీలో ప్రవేశిస్తే ప్రమాదం.

**పండితుడు – పడవవాడు:** ఒకానొక సమయంలో ఒక పండితుడు అత్యవసర పనిమీద గోదావరి దాటి వేరే ఊరు వెళ్ళవలసి వచ్చింది. ఒక పడవవాణ్ణి పిలిచి అందులో ఎక్కాడు. ఈ పండితునికి ఎప్పుడూ ఏదో ఒకటి మాట్లాడుతూ ఉండడం అలవాటు. కొంత దూరం పోయిన తరువాత ఊరికే కూర్చోలేక పడవవాణ్ణి "ఏమయ్యా! మీ గ్రామంలో రాజకీయాలెలా ఉన్నాయి? మొన్న ఎలక్షన్లలో ఎవరు గెలిచారు?" అని అడిగాడు. "స్వామీ! నాకు నోటు సంగతి తప్ప ఓటు సంగతి తెలియదు. నాకెవరో పది రూపాయలిచ్చారు, వాళ్ళకి నేను ఓటు వేశాను. అంతేతప్ప ఎవరు గెలిచారో, ఎవరు ఓడారో నాకేమీ తెలియదు" అన్నాడు. అప్పుడా పండితుడు "ఒరేయ్ పిచ్చివాడా! ఈ కలియుగంలో పుట్టి రాజకీయాల సంగతి తెలుసుకోకపోతే బ్రతికీ ఏమి ప్రయోజనం? నీ జీవితంలో పావు భాగం గంగపాలు అయినట్లే!" అన్నాడు. "పోతే పోనీయండి స్వామీ, నాకేమీ దిగులు లేదు" అని వాడు పడవ నడపడంలో నిమగ్నుడయ్యాడు. మరికొంతసేపటికి ఈ పండితుడు "ఒరేయ్! పని తొందరలో నేను గడియారం పెట్టుకొని రావడం మరచిపోయాను. ఇప్పుడు గంట ఎంతయింది?" అని అడిగాడు. "స్వామీ! నాకు గంటలెట్లా తెలుస్తాయి?! తెల్లవారి లేచిన మొదలు నా పనులు నేను చేసుకొని రాత్రయ్యేసరికి హాయిగా నిద్రిస్తాను. కనుక నాకు గడియారంతో పని లేదు. గంట

చూడడం కూడా రాదు " అన్నాడు. "ఒరేయ్ పిచ్చివాడా! కనీసం ఆడని గడియారమైనా చేతికి పెట్టుకోవడం ఈ కలియుగంలో ఫ్యాషన్! అందులోను నీకసలు గంట చూడడమే రాదంటున్నావు. కనుక నీ జీవితంలో అర్ధభాగం గంగపాలైనట్లే!" అన్నాడు పండితుడు. మరికొంత దూరం పోయిన తరువాత "పోనీ, నీకు ఎక్కాలేమైనా వచ్చా?" అని అన్నాడు. ఆ పడవవాడు "ఈ ఎక్కాలు, లెక్కలు నాకెందుకు స్వామీ? ఎంత దూరానికి ఎంత డబ్బు తీసుకోవాలో నాకు తెలుసు. అంతే చాలు" అన్నాడు. "అయితే నీ జీవితంలో మూడు భాగాలు గంగపాలైనట్లే!" అన్నాడు పండితుడు. ఈవిధంగా మాట్లాడుతుండగానే పెద్దగా సుడిగాలి వీచడం ప్రారంభమై అలల తాకిడికి పడవ అటూ ఇటూ ఊగసాగింది. మరికొంత సేపటికి కుంభవృష్టి ప్రారంభమైంది. "స్వామీ! మీకు ఈత వచ్చా? " అని అడిగాడు పడవవాడు. "ఒరేయ్ నాకు ఈత రాదురా" అన్నాడు పండితుడు ఆందోళనగా. "అయితే మీ జీవితం పూర్తిగా గంగపాలైనట్లే" అన్నాడు పడవ వాడు. కొద్దిసేపటికి ఆ పడవ పూర్తిగా మునిగిపోయింది, దానితోపాటు పండితుడు కూడా మునిగిపోయాడు. ఈత తెలిసిన ఆ పడవవాడు మాత్రం గట్టుకు చేరి ప్రాణాలు కాపాడుకోగల్గాడు.

**సంసార సాగరంలో గీతయే ఈత:** చూశారా! నది దాటడానికి ఈత ఎంత ప్రధానమో భవసాగరం దాటడానికి గీత అంత ఆధారం. సంసార సాగరంలో ప్రయాణం చేస్తున్న మనకు గీత కావాలిగాని ఈ ఎలక్షన్లు, న్యూస్‌పేపర్లు కాదు ముఖ్యం. సంసారసాగరంలో ప్రయాణం చేసే ప్రతి వ్యక్తి గీతను తెలుసుకోవాలి. అది తెలియకపోతే ఎన్ని తెలుసుకొన్నా ప్రయోజనం లేదు. సంసార సాగరంలో గీతయే ఈత. ఆ గీత యొక్క తత్త్వమేమిటి ?

''అనన్యాశ్చింతయంతో మాం యేజనాః పర్యుపాసతే తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహం." అన్య చింతలను



వీడి నిరంతరము దైవాన్నే స్మరిస్తే మన యోగక్షేమాలను తానే చూసుకుంటాడు. సర్వకర్మలను దైవభావంతో ఆచరించినప్పుడు అన్నీ సఫలమవుతాయి.

**జ్ఞానాగ్ని ఆవిర్భవించాలంటే:** మన చుట్టూ డివైన్ వైబ్రేషన్‌ను అభివృద్ధి పర్చుకోవాలి. ఇది కేవలం నామచింతన వల్లనే సాధ్యమవుతుంది. మన రెండు చేతులకుమధ్య రాపిడి జరిగితే చల్లగా ఉన్న చేతులు కూడా వేడెక్కిపోతాయి. రెండు కొమ్మలు ఒకదానితో ఒకటి రాచుకుంటే అక్కడ కూడా అగ్ని పుడుతుంది. అదేవిధంగా మనలో జ్ఞానాగ్ని ఆవిర్భవించాలంటే నామానికి, రూపానికి మధ్య రాపిడి జరగాలి. రాం, రాం, రాం, రాం... అని నోటితో పలకాలి. రూపాన్ని మనస్సులో చింతించాలి. ఈ రెండూ జరిగినప్పుడే మనలో జ్ఞానాగ్ని ఆవిర్భవిస్తుంది. ఈ జ్ఞానాగ్ని మనలో ఆవిర్భవించిందంటే సర్వపాపములను భస్మం చేస్తుంది. దైవత్వానికి సమీపంగా తీసుకొనిపోతుంది.

**ముందుకుపోని పడవ :** ఒకానొక సమయంలో రాధ, కొంతమంది గోపికలు కలిసి మధురకు వెళ్ళి కృష్ణుణ్ణి చూడాలనుకున్నారు. ఒకనాటి రాత్రి ఎవ్వరికీ తెలియకుండా యమునా నదికి వెళ్ళి ఒక పడవ నెక్కి కూర్చున్నారు. రాత్రంతా కృష్ణ నామాన్ని స్మరిస్తూ తెడ్లు వేశారు. కానీ తెల్లవారిన తరువాత చూస్తే పడవ క్రిందటి రాత్రి ఎక్కడ ఉందో అక్కడే ఉంది. ఒక్క ఇంచైనా ముందుకు పోలేదు. కారణమేమిటని విచారిస్తే అది ఒక గూటానికి కట్టివేయబడి ఉంది. అదేవిధంగా మన జీవితమనే పడవను సంసారమనే గూటానికి కట్టివేసి, "దేవుడా! దేవుడా!" అంటూ కూర్చుంటే దేవుణ్ణి ఏవిధంగా చేరగలము? ముందు సంసారంనుండి కట్టు విప్పాలి. సర్వేశ్వర నామాన్ని స్మరిస్తూ ప్రయాణించాలి. అప్పుడే ఈ 'పడవ' అతి శ్రీఘ్రంగా గమ్యం చేరగలదు.

**భక్తుని వెనుకనే భగవంతుడు:** భగవంతుడు ఎట్టి పరిస్థితులందైనను తనను హృదయపూర్వకంగా చింతించే భక్తుణ్ణి ఎన్నటికీ వదలిపెట్టడు. ఒకానొక సమయంలో భగవంతుడు ఒక భక్తునికి "నేనెప్పుడూ నీ వెంటనే ఉన్నాను. నీ వెనుకనే నడుస్తూ వస్తున్నాను" అని హామీ ఇచ్చాడట. కానీ నిజంగానే నా వెనుక వస్తున్నాడా అని ఇతనికి సందేహం కలిగి వెనుకకు తిరిగి చూస్తే భగవంతుడు కనిపించలేదు."ఓ భగవంతుడా! నాకెందుకు అబద్ధం చెప్పావు?" అని ప్రశ్నించాడు. భగవంతుడు చిరునవ్వు నవ్వి "పిచ్చివాడా! నేనేమీ అబద్ధం చెప్పలేదు. నీవే నా మాటలను సరిగా అర్థం చేసుకోలేదు. నేను నీ వెనుకనే ఉంటానని చెప్పాను కదా! కనుక నీవు వెనుకకు తిరిగినప్పుడు నేను కూడా నీతోపాటు తిరిగాను. అందుచేతనే నీవు నన్ను చూడలేకపోయావు" అన్నాడు. చూశారా! భగవంతుని మాటలలో ఎట్టి దోషమూ లేదు. భక్తుడే సరిగా అర్థం చేసుకోలేక అనర్థాలకు గురి అవుతున్నాడు.

**తెలివైన విద్యార్థి:** ఒక గురువు తన శిష్యులను పిలిచి, "మీకొక తీపి పదార్థమును ఇస్తున్నాను. ఈగలు వ్రాలకుండా, చీమలు పట్టకుండా, ఎవ్వరూ దొంగిలించకుండా దీనిని సంరక్షించుకోండి" అన్నాడట. కొందరు దానిని పెట్టెల్లో పెట్టి తాళం వేశారు. మరికొందరు డబ్బాల్లో పెట్టి మూత పెట్టారు. కానీ ఒక తెలివైన విద్యార్థిమాత్రం దానిని చక్కగా తిని కడుపులో భద్రం చేసుకొన్నాడు. మరునాడు గురువుగారు తానిచ్చిన తీపి పదార్థమును ఎవరెవరు ఏ ఏ విధంగా భద్రం చేసుకున్నారో చెప్పమన్నాడు. ఒకడు దానిని పెట్టెలో పెట్టి తాళం వేశానన్నాడు. మరొకడు దానినొక డబ్బాలో పెట్టి చీమలు పట్టకుండా నీళ్ళలో పెట్టానన్నాడు. ఈవిధంగా ఒక్కొక్కరు ఒక్కొక్క రీతిగా సమాధానం చెప్పారు. చివరిగా ఆ తెలివైన విద్యార్థి ముందుకు వచ్చి, "గురూజీ! నాకిచ్చిన తీపి వేరొకరికి చిక్కకుండా నేనే భుజించి జీర్ణించుకొని



ఆనందిస్తున్నాను" అన్నాడు. అదేవిధంగా భగవన్నామమనే తీపిని కూడా చక్కగా ఆరగించి జీర్ణించుకోవాలి. అనగా హృదయ ఫలకంపై లిఖించుకొని భద్రం చేసుకోవాలి. సర్వదా సర్వ కాలేషు సర్వత్ర హరిచింతనం చేయాలి. ఈ కలియుగంలో నామస్మరణను మించిన తరణోపాయం లేదు.

**( తేది : 15-03-1998 సాయంత్రం త్రయీబృందావనంలో శ్రీ బాబా వారు విద్యార్థులకు అనుగ్రహించిన దివ్య సందేశము నుండి)**

# దీపావళి

దీపావళికి ముందురోజు నరక చతుర్దశి. ఆరోజు తెల్లవారు జామున నిద్రలేచి నువ్వులనూనెతో తలంటుకొని అభ్యంగన స్నానం చేయాలి.

అభ్యంగనస్నానం చేస్తూ 3 సార్లు యమునికి అర్ఘ్యం ఇవ్వాలి. మినపప్పుతో పిండివంట చేసుకొని తినాలి. సాయంకాలం సంధ్యాసమయం నుండి ఇంటిలోపల, బయట దీపాలు వెలిగించాలి.

నరక చతుర్దశికి మరురోజు దీపావళి. ఈ రోజు సూర్యోదయానికి ముందే నిద్రలేచి స్నానాలు చేయాలి. **1.మల్లి, 2.మామిడి.3.అత్తి, 4.జువ్వి, 5.నేరేడు ఆకులను (పంచ పల్లవాలు) నీళ్లలో వేసి ఆ నీళ్లతో నేడు స్నానం చేయాలి.** నేటి ప్రదోష సమయంలో ఇంటిలో, బయట, ప్రహారీలపైన, ముఖ ద్వారాలపైన నువ్వుల నూనెతో దీపాలు వెలిగించాలి. ( నువ్వులనూనెలో లక్ష్మీదేవి వుంటుందని పెద్దల వాక్యం). ఆ తరువాత లక్ష్మీపూజ చేయాలి. 1.నరకాసుర వధ జరిగిన సంతోషంలో ప్రజలు దీపావళి చేసుకుంటారు.

**2.** రావణ సంహారానంతరం శ్రీరాముడు అయోధ్యకు తిరిగి వచ్చిన ఈరోజు ప్రజలు దీపాలు వెలింగించి వేడుకలు చేసుకున్నారు అని కొందరి మతం.

**3.** వామనుడు త్రివిక్రముడై బలిచక్రవర్తి రాజ్యాన్ని రెండు పాదాలతో ఆక్రమించి, మూడోపాదంతో బలిని పాతాళానికి పంపిన రోజు దీపావళి అని మరికొందరి అభిప్రాయం.

# శ్రీ మదాంధ్ర మహా భాగవతం

– డాక్టర్ ఆచార్య జక్కంపూడి మునిరత్నం (తిరుపతి)

(గత సంచిక తరువాయి)

**యోగి ఉద్గమనం:** "రాజా! యోగిచర్యను చెబుతా విను. యోగి పాదమూలంతో గుదస్థానంలోని మూలాధార చక్రాన్ని అదిమి పడతాడు. ఆ తరువాత ప్రాణవాయువును బిగబట్టి బొడ్డుస్థానంలో ఉన్న మణిపూరక చక్రానికి తీసుకువెళతాడు. ఆ మీద హృదయంలోని అనాహత చక్రానికి చేరుస్తాడు. అక్కణ్ణుంచి వక్షంలోని విశుద్ధ చక్రానికి తీసుకుపోతాడు. ఆ చక్రం నుంచి దాని పై భాగంలో ఉండే తాలుమూలానికి చేరుస్తాడు. అక్కణ్ణుంచి కనుబొమల మధ్యస్థానంలో ఉండే ఆజ్ఞా చక్రానికి తరలిస్తాడు. కళ్ళు, చెవులు, ముక్కు, నోరు మూసుకొని ఏ కోరికా లేని స్థితిలో అర్ధముహూర్త కాలంపాటు ఇంద్రియాలతో సంబంధాన్ని తెంచివేసి ప్రాణాన్ని నిగ్రహిస్తాడు. బ్రహ్మరంధ్రం భేదించుకొని పైకి వెళతాడు. ఇక్కడ స్వాధిష్ఠాన చక్రం పేర్కొబడకపోవడం, తాలుమూలం పేర్కొనబడడం గమనించదగి ఉంది.

ఆకాశ మార్గంలో ప్రయాణించి అగ్నిదేవతను చేరుకుంటాడు. ఆ ప్రకాశం సహాయంతో తన పుణ్యపాపాలను నశింపజేసుకుంటాడు. అక్కణ్ణుంచి ముందుకు వెళ్ళి నక్షత్ర స్థానాన్ని అధిగమిస్తాడు. సూర్యమండలం నుంచి ధ్రువమండలం దాకా ఉండే అన్ని మండలాలను దాటి వెళతాడు. చివరకు విష్ణువుకు సంబంధించిన శింశుమారచక్రం చేరుకుంటాడు. పరమాణువు ఆకారం గల లింగశరీరంతో మహర్లోకంలో ప్రవేశిస్తాడు. ఆ లోకంలో బ్రహ్మవేత్తలు నివసిస్తూంటారు. అతడు ఒక మహాకల్ప కాలం



అక్కడ ఉంటాడు. ఆ కల్పం చివర అనంతుని ముఖాలనుంచి వెలువడే అగ్నికి స్వర్గమర్త్యపాతాళ లోకాలు మూడూ కాలిపోతాయి. ఆ దృశ్యాన్ని కూడా ఈ యోగి చూడగలుగుతాడు. ఆ అగ్ని తాపానికి తట్టుకోలేక అక్కడ నుండి బయలుదేరి బ్రహ్మలోకం చేరుకుంటాడు. బ్రహ్మలోకంలో కృశించడం, శోకం, ముసలితనం, చావు, భయం ఉండవు. పద్నాలుగు మంది మనువుల కాలం అక్కడ ఒక్కరోజే. అక్కడికి వెళ్ళిన యోగి తిరిగిరాడు. అక్కడే నివసిస్తాడు. వారివారి పుణ్యాన్ని బట్టి బ్రహ్మ లోకస్తులకు అధికారాలు సంక్రమిస్తాయి. బ్రహ్మనూ' తక్కిన దేవతలను ఆరాధించినవారు ఒక బ్రహ్మకాలంపాటు బ్రహ్మలోకంలోనే ఉండి తరువాత మోక్షం పొందుతారు. విష్ణువును ఆరాధించినవారు మాత్రం నిరాటంకంగా బ్రహ్మాండాన్ని భేదించుకొని వెళ్ళి విష్ణుస్థానం చేరుకుంటారు. వీరికి మరణ భయం ఉండదు. ఎన్ని కల్పాలు గడిచినా తిరిగిరారు."

శుకమహర్షి యోగిసాగించే ప్రయాణాన్ని విశదంగా ఇక్కడ వివరించాడు. యోగి కుండలినీశక్తిని షట్చక్రాల ద్వారా పైకి తీసుకు వెళతాడు. షట్చక్రాలంటే ఆరు చక్రాలు. వాటిలో మొదటిది మూలాధారం. ఇది గుదస్థానంలో ఉంటుంది. రెండవది స్వాధిష్ఠానం. ఇది లింగస్థానంలో ఉంటుంది. మూడవది మణిపూరం. ఇది నాభిస్థానంలో ఉంటుంది. నాల్గవది అనాహతం. ఇది వక్షఃస్థలంలో ఉంటుంది. ఐదవది విశుద్ధం. ఇది కంఠ స్థానంలో ఉంటుంది. ఆరవది ఆజ్ఞాచక్రం. ఇది కపాల భాగంలో కనుబొమల నడుమ వెనుక వైపున ఉంటుంది.

శుకమహర్షి వర్ణించిన యోగి ఊర్ధ్వలోక సంచారాన్ని గమనించినప్పుడు ఆశ్చర్యము, ఆనందము కలుగుతాయి. మేను పులకరిస్తుంది. యోగాన్నవలంబించి ఊర్ధ్వగాములు కావాలనిపిస్తుంది. ఈ అంశాన్నే భాగవతం కూడా పరోక్షంగా ప్రోత్సహిస్తుంది. పరబ్రహ్మలో ఐక్యం

కాదలచినవారు పాపాన్ని మాత్రమే గాక పుణ్యాన్ని కూడా నశింపజేసుకోవాలని భాగవతాన్ని బట్టి తెలుస్తుంది.

అర్ధ ముహూర్తమంటే ఒక ఘడియకాలం. 6 క్షణాలు. 24 నిమిషాలు. కల్పమంటే 1000 యుగాలు. కృత, త్రేతా, ద్వాపర, కలియుగాలు నాలుగు కలిసి ఒక మహాయుగమౌతుంది. కృతయుగం 17 లక్షల 28 వేల సంవత్సరాలు. త్రేతాయుగం 12 లక్షల 96 వేల సంవత్సరాలు. ద్వాపరయుగం 8 లక్షల 64 వేల సంవత్సరాలు. కలియుగం 4 లక్షల 32 వేల సంవత్సరాలు. ఈ నాలుగు యుగాలు కలిసి ఒక మహాయుగమౌతుంది. కాబట్టి బ్రహ్మకు ఒక పగలౌతుంది. అంటే (432,00,00,000) 432 కోట్ల సంవత్సరాలు. బ్రహ్మకు రాత్రి కూడా 432 కోట్ల సంవత్సరాలు. 864 కోట్ల సంవత్సరాలైతే బ్రహ్మకు ఒక రోజు. 25,920 వేల కోట్ల సంవత్సరాలైతే బ్రహ్మదేవుడికి 100 సంవత్సరాలౌతుంది. అదే ఆయన ఆయుర్దాయం. ఇక్కడ గమనించవలసింది ఏమిటంటే, అన్ని సంవత్సరాలు బ్రతికినప్పటికీ బ్రహ్మ కూడా మరణించక తప్పదు. ఆయన సంగతే అట్లైనప్పుడు సామాన్య మానవుల సంగతి చెప్పనవసరం లేదు. కాబట్టి అశాశ్వతత్వాన్ని గుర్తించి పరమాత్మను ఆశ్రయించవలసిన ఆవశ్యకతను భాగవతం పరోక్షంగా ఇక్కడ బోధపరుస్తుంది.

**భక్తి గరిమ:** సంసారులకు తపస్సు, యోగం మొదలైన మోక్షమార్గాలనేకం ఉన్నాయి. వాటిలో ఎంతో శ్రేష్ఠమైంది, అత్యంత సులభమైంది భక్తిమార్గమే.

పూర్వం బ్రహ్మ మూడుసార్లు వేదాన్ని పరామర్శించాడు. తరించేందుకు తోడ్పడేది భక్తి మాత్రమే అని నిశ్చయించుకున్నాడు. ఎటువంటి వికారమూ లేకుండా విష్ణుదేవుడి ఆత్మ స్వరూపాన్ని తదేకంగా ధ్యానించాడు. శ్రీహరి ప్రాణులందరిలోనూ ఆత్మరూపంలో ఉంటాడు. అతడే అందరికీ సేవింపదగినవాడు. విష్ణుకథలను వీనులారా వింటే అతని



పాదాలను చేరుకోవచ్చు. ఇది సత్యం.

బ్రహ్మవర్చస్సును, సర్వాధికారాన్ని కోరేవాడు బ్రహ్మను ఉపాసించాలి. ఇంద్రియపటుత్వం కావాలనుకునేవాడు ఇంద్రుణ్ణి సేవించాలి. సంతానార్థులు దక్షుడు మొదలైన ప్రజాపతులను, పితృదేవతలనూ ఆరాధించాలి. భోజనం కోసం అదితిని పూజించాలి. స్వర్గంకోసం ఆదిత్యులనూ ప్రార్థించాలి. రాజ్యం కోసం విశ్వదేవతలనూ, మనురూప దేవతలనూ ఆరాధించాలి. ప్రజలను స్వాధీనం చేసుకోవాలనుకునేవారు సాధ్యులను సేవించాలి. సంపద కోసం దుర్గను, తేజస్సు కోసం అగ్నినీ, ధనంకోసం వసువులనూ, వీర్యాభివృద్ధికోసం ఏకాదశ రుద్రులనూ, ఆయువుకోసం అశ్వినీ దేవతలనూ ఉపాసించాలి. పుష్టి కోసం భూమినీ, ప్రతిష్ఠకోసం భూమ్యాకాశాలనూ, అందం కోసం గంధర్వులనూ, వనితల వాంఛకు ఊర్వశినీ, విత్తం కోసం ప్రచేతసుణ్ణీ, విద్యకోసం శివుణ్ణీ, దాంపత్య సుఖం కోసం పార్వతీదేవినీ, రక్షణ కోసం యక్షులనూ, బలంకోసం మరుత్తులనూ, శత్రు మరణం కోసం నిర్ఋతినీ, భోగాలకోసం చంద్రుణ్ణి ఆరాధించాలి. వేటిని కోరినా కోరకపోయినా తత్త్వం తెలిసినవాడు మోక్షాన్నే కోరుకుంటాడు.

**వైదాన్తభేరికి ఈ క్రిందివారు పోషక చందా పంపినారు**

| | | | |
|---|---|---|---|
| (1). | నాగిశెట్టి దామోదరరావు (పొదలకూరు) | – | రూ. 1500/- |
| (2). | పాలెంపల్లి పుల్లయ్య (హైదర్‌షా, కోఠి) | – | రూ. 1500/- |
| (3). | జి. అన్నపూర్ణ (కర్నూలు) | – | రూ. 2000/- |
| (4). | కె. శ్రీనివాసరెడ్డి (కడప) | – | రూ. 1500/- |
| (5). | పి. శ్రీరామారావు (హైద్రాబాద్) | – | రూ. 1516/- |
| (6). | సి. ఆదినారాయణయ్య (బెంగుళూరు) | – | రూ. 1001/- |

# రామ జోగి మందు కొనరే

– డా॥ ఆచార్య కె. సర్వోత్తమరావు, (తిరుపతి)

లోకంలో చాలామంది కండబలాన్ని, ధనబలాన్ని, అధికారబలాన్ని పరిచర బలాన్ని ఎక్కువగా మదింపు చేసుకుంటారు. అయితే ఇవన్నీ 'ఆరోగ్యం' లేకపోతే అలంకారప్రాయాలే. అన్నిటికన్నా 'దైవబలం' గొప్పది.

ఆరోగ్యం రెండు రకాలు. శారీరక ఆరోగ్యం, మానసిక ఆరోగ్యం. 'రోగం రట్టు సంసారం గుట్టు' అని సామెత. వ్యాధి వచ్చినవాడు వెర్రి పట్టినవాడు ఒకటే. అన్నీ సాగితే రోగమంత భోగం లేదు. జరుగుబాటుంటే జ్వరమంత సుఖం లేదు అని తెలుగు సామెతలు చెబుతున్నాయి. 'ఊట బల్లవనిగె రోగ విల్ల మాతు బల్లవనిగ జగళవిల్ల' అంటే తిండి విషయంలో జాగ్రత్తపడేవానికి రోగభయం లేదు. జాగ్రత్తగా సంభాషణ సాగించే వానికి జగడమూ లేదు అని కన్నడ సామెత. "వైద్యనక్కు కొడుప్పదు వాణియ నుక్కుకొడు" అంటే వైద్యునికిచ్చే డబ్బు గాండ్లవాళ్ళకు ఇవ్వు అని తమిళ సామెత. చాలా రోగాలు నూనెల వల్లనే వస్తాయి కనుక ఈ హెచ్చరిక.

మానసిక ఆరోగ్యం మనిషికి చాలా అవసరం. మనోవ్యాధికి మందు లేదు అని సామెత. కళలపట్ల అనురక్తి ఆధ్యాత్మికాంశాలపట్ల ఆసక్తి, సామాజిక జీవన స్థితి గతులపై అవగాహన, దైవచింతన లాంటివి మానసిక ఆరోగ్యాన్ని కాపాడతాయి. అందువల్లనే దేవుని భవరోగవైద్యుడన్నారు. వైద్యుడు రోగాలను నయం చేస్తాడు. అతడే నారాయణుడు. భక్తి సాహిత్యంలో వైద్యప్రశంస, వైద్యుని 'హస్తవాసి' ప్రతిభల వర్ణనలు అపారం. వీటిని చమత్కారంగా, సాటివారికి అర్థమయ్యేలా చెప్పడం వాగ్గేయకారులకు చెల్లు. తెలుగు పదకవులలో ప్రథమస్థానమందుకొన్న అన్నమయ్య తన పదాలలో భువనౌషధం, ఘనదివ్యౌషధం, సిద్ధౌషధములు ప్రస్తావించాడు.

**"వేదవేద్యులు వెదకేటి మందు**

**ఆది నంత్యములేని ఆ మందు**

**పంకజాక్ష వెంకటరమణ ప్రసన్నుని మందు**

**శంకించక తన దాసుల చేపట్టే మందు"** అని చెప్పడమే గాకుండా తిరుమల శ్రీవేంకటేశ్వరుని 'కోనేటి దరినున్న మందు, ఉనికి మనికి కెల్ల



ఒక్కటే మందు. భవరోగములు వీడి పారగ పెద్దలు మున్ను జవకట్టి కొనిన నిచ్చలమైన మందు' అని మందు దొరికే ప్రదేశము మందు పుచ్చుకొనడం వల్ల కలిగే లాభాలు అన్నీ ఏకరువు పెట్టాడు. ఇక భజన సంప్రదాయానికి చెందిన రామదాసు **"రామ జోగి మందు కొనరే పామరులారా! రామజోగి మందు కొనరే"** అనే కీర్తనలో కొండల లాంటి పాపకర్మాలను కూడా కరిగించే మందుగా, పదునాలుగు లోకాలలో సాటిలేని మందుగా, డబ్బిస్తామన్నా దొరకని మందుగా, భాగవతులు సదా సర్మించే మందుగా, తాను సద్భక్తితో సేవించే మందుగా విశదీకరించి

**"ముదముతో భద్రాద్రియందు ముక్తి పొందించే మందు"**గా నిర్దేశించినాడు.

భారతదేశ భక్తి సాహిత్యంలోనే మహారాష్ట్ర, కర్ణాటక వాగ్గేయకారుల పాటలకు పదిలస్థానముంది. ఈ ప్రాంత భక్తుల సాదాసీదా జీవితం, సమాజంలో అన్ని వర్గాలవారితో కలిసిపోయే మనస్తత్వం ఆశ్చర్యకర మయింది.

కన్నడ హరిదాసులలో 'పురందర దాసుకు'న్న స్థానం అద్వితీయం. 'దాసరందరె పురందరదాసరయ్య' అని గురువుగారి మెప్పుదల పొందిన మహనీయుడు. తన సంకీర్తనలలో 'నామావళి'కి ప్రాధాన్యమిచ్చినవాడు. "ఇదిగో తీసుకోండి. బాధపడుతున్నారెందుకు? భవరోగాలకు ఔషధం లేదనుకొనేరు సుమా. ఉంది ఉంది. అవే వాసుదేసుని నామాలు. వాతవిధ్వంసిని వాసుదేవ నామం. జనార్దననామం జ్వరాంకుశం. మాధవనామం మనగంద మండూరం. అజుని తండ్రి ఆ ఆదిజుని పేరు త్రైలోక్య చింతామణి. నారాయణనామం తామ్రభస్మం. రామచంద్రనామం పూర్ణచంద్రోదయం" అని ఆయుర్వేద ఔషధాలపట్టిక పూర్తిగా ఇచ్చి ఈ మందుల్ని వాడినవారు సామాన్యులు కారు సుమా. ప్రహ్లాద, ముచుకుంద, ధ్రువ, ద్రౌపది, అజామీళాదులన్నాడు.

కన్నడ హరిదాసులలో 'గోపాలదాసు' ఒకరు. ఆయన ధన్వంతరి దగ్గఱకు వెళ్లి ఇలా ప్రార్థించారు. నా అదృష్టం కొద్దీ నీవు దొరికావు. నా రోగ నివారణకు ఉపాయం సూచించే వైద్యుడివి. నా జబ్బు ఈనాటిది కాదు సుమా. అనాదికాలం నుండి పీడించే జబ్బు. నా జబ్బును నివారించు. నీవు చేసిన ఉపకారాన్ని ఏనాడూ మరచిపోను. ఇది సత్యమన్నారు. కలియుగంలో నామస్మరణ వల్ల మానవులు సర్వరోగ విముక్తులై సుఖశాంతి సంయుక్తులై భగవత్సాన్నిధ్య మార్గంలో పయనించే 'బాటసారులు'గా ముందడుగు వేస్తారు.

# మనస్సును టీ.వీ.ని బాగుచేసుకుందాం!

– కె. ఈశ్వర్

పరుగు పరుగున పరుగెత్తాడు ఒకాయన టీ.వీ.రిలేస్టేషన్ లోనికి. 'ఏమయ్యా నా టీ.వీ.లో మీ పాటలు వినిపించుటలేదు. కనుపించుటలేదు. మా పక్కింటి ఆయన టీ.వీ.లో కనిపిస్తున్నవి, వినిపిస్తున్నవి. నాపై మీకు ఏమిటి పక్షపాతం? పక్కింటాయనపై మీకేమిటి ప్రేమ ? ఇది మీకు తగునా? ఇలా చేయుట అన్యాయం, అధర్మం ' అని అదరకొడుతున్నాడు టీ.వీ. స్టేషన్‌లోని సిబ్బందిని యావత్తూ!

అందులోని ఒక ఇంజనీర్‌గారు ఇతని వాలకం చూచి– 'అయ్యా ! నీ టీ.వీ. మంచి కండిషన్‌లో వుందా? దానికి యాంటీనా వుందా?' అని ప్రశ్నించెను. 'అయితే టీ.వీ. పనిచేయాలంటే ఇవన్నీ అవసరమా?' అని అమాయకంగా అడిగాడా టీ.వీ. యజమాని.

చెడిపోయిన టీ.వీ. ఏ ప్రసారాలను అందుకోలేదుగదా? తన టీ.వీ. బాగుచేసుకొనుటకు ప్రయత్నించక టీ.వీ.స్టేషన్‌వారిని దూషిస్తే ఎలా వుంటుందో భగవదనుగ్రహం అంతటా జగమంతట ప్రసారమగుచున్నది. కానీ మన మనస్సను టీ.వీ. ఖరాబై బుద్ధి అను యాంటీనా చెడిపోయి భగవదనుగ్రహాన్ని గ్రహించుటలేదు. స్వీకరించుటలేదు. భగవంతుడు కరుణామయుడు. వారి కరుణ అపారము.

గొడుగు క్రిందకు రమ్మని భగవంతుడు పిలిస్తే గొడుగు విరిచేస్తే గొడుగు నీడ మనకు ఎలా దొరుకుతుంది? చెట్టు నీడను ఉపయోగించుకొనమని చెపితే చెట్టునే నరికివేస్తే నీడ ఎలా వస్తుంది? అలాగే భగవదనుగ్రహం అనే నీడకు రమ్మని మనలను ఆహ్వానిస్తే మనం పాపకార్యాలు చేస్తూ దేవునికి దూరమైపోతున్నాము. అలా కాకుండా మనస్సును హింసకు చోటులేని కల్మషరహితంగా, తమోగుణ, రజోగుణరహితంగా చేసుకొని, సత్వగుణయుతంగా మార్చుకొనిన భగవదనుగ్రహం కలుగగలదు.

అలా కానిచో చెడిపోయిన టీ.వీ.తో సమానమై భగవదనుగ్రహం పొందుటలో విఫలమైన వారమగుదుము. తద్వారా అశాంతి మనలో చోటుచేసుకొనగలదు. అటుపై జీవితం అంధకారం కాగలదు. అట్టి పరిస్థితికి అవకాశం ఇవ్వకుండా మన మనస్సను టీ.వీ.ని సద్గురువను ఇంజనీర్ ద్వారా రిపేరు చేయించుకొని తద్వారా భగవదనుగ్రహం అనే మహాభాగ్యాన్ని పొంది ఆనందంగా జీవిత నౌకను కొనసాగిద్దాం!

శ్రీ సద్గురుదేవులు మనకు అండగా వుండి మనకు చేయూతనిచ్చెదరుగాక!

**జయ్ శ్రీరామ – వాసుదేవ, జయ్ గురుదేవ**



## వార్తలు

**(01).** 19-09-2018 తేది నుండి 25-9-2018 వఱకు 3వ భాగవతసదస్సు 7 రోజులు శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో జరిగినది. అందు ఉదయం, సాయంత్రము ఆదరణీయ డా॥ గీతావాణి ఎం.ఎ.,బి.ఇ.డి., సాహిత్య శిరోమణి గారు (విశ్రాన్త గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్) భాగవతం 3వ స్కంధంపై అద్భుతంగా ప్రవచన చేశారు. స్థానిక వరదరాజస్వామి గుడి ప్రాంగణంలో జరిగిన ఈ భాగవత ప్రవచనలకు శ్రోతలు విశేషంగా వచ్చి ఆనందించారు. చివరి రోజున శ్రీశుకబ్రహ్మాశ్రమం వారు డా॥ గీతావాణి గారిని సత్కరించారు.

**(02).** 7-10-2018 తేది ఆదివారం మాసశివరాత్రి సందర్భంగా ఆశ్రమ శివాలయంలోని శివునికి అభిషేకం, బిల్వార్చన చేయబడి, ప్రసాద వితరణ చేయబడినది.

**(03).** దేవీ నవరాత్రుల సందర్భంగా 16-10-2018 తేది శ్రీశుకబ్రహ్మాశ్రమంలో సరస్వతీదేవి పూజ, 17వ తేది దుర్గాష్టమి నాడు శ్రీదుర్గాదేవి పూజ, 18వ తేది మహర్నవమి నాడు శ్రీ లక్ష్మీదేవి పూజ జరిగినది. మూడు రోజులు దేవీ స్తోత్రాల పారాయణ, భజనలు జరిగినవి. విజయదశమి నాడు సుహాసిన స్త్రీలకు వస్త్ర ప్రదానం జరిగినది.

**(04).** 21-10-2018 తేది ఆదివారం నుండి 27-10-2018 తేది శనివారం వఱకు పూజ్య శ్రీ విద్యాప్రకాశానందస్వామి స్మారక 4వ భాగవత సదస్సు ఉదయం శ్రీ శుకబ్రహ్మాశ్రమ శివాలయంలో, సాయంత్రం స్థానిక వరదరాజస్వామి గుడి ప్రాంగణంలో జరిగినది. పరమపూజ్య శ్రీ స్వామిశారదాప్రియానందగారి ముఖ్యశిష్యురాలు పూజ్యశ్రీ స్వామిని శీలానంద సరస్వతి (చిన్మయారణ్య అధిపతులు)గారు భాగవతం 4వ స్కంధంపై ప్రవచన చేశారు. టౌన్ మధ్యగల వరదరాజగుడి ప్రాంగణంలో జరిగిన సాయంకాలపు సదస్సుకు పట్టణంలోని ప్రజలు అధికంగా వచ్చారు. మాతాజీ శీలానందస్వామినివారి ప్రవచనా శైలికి అందరూ ఆకర్షితులైనారు. 27వ తేది జరిగిన చివరి సదస్సులో పూజ్యశ్రీ శీలానంద స్వామినివారికి శ్రీశుకబ్రహ్మాశ్రమం వారు సత్కారం చేశారు.

**(05).** అయిదవ భాగవత సదస్సు 26-11-2018 తేది నుండి 2-12-2018 తేది వరకు శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో జరుగును. ఈ సదస్సులో పూజ్యశ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు (హైద్రాబాద్) భాగవతం పంచమ స్కంధంపై ప్రవచన చేస్తారు. అందరికీ ఆహ్వానము.

**(6).** శ్రీ శుకబ్రహ్మాశ్రమ త్రినేత్ర వైద్యాలయం భక్త కన్నప్ప కంటి ఆసుపత్రిలో సెప్టెంబర్‌లో ఓ.పి విభాగంలో **976** మందికి కంటి పరీక్షలు, చికిత్సలు జరిగినవి. **109** మందికి కంటి పొరలు తీసి కళ్లలో లెన్సు అమర్చబడినవి. **11** మందికి యాగ్ లేజర్ చికిత్సలు జరిగినవి.